# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ : (0863) 2293280, 2293564, 2293206

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

**గూడూరి వెంకటరత్నం**

**డి.జె. బాలకృష్ణ లాల్**

**డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి**

**మిస్.పి. ఇందిరాదేవి**

**జి.ఎస్.ఆర్. మూర్తి**

**డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు**

**డా॥ యమ్.స్వర్ణముఖి**



Volume 29 Issue 12

No.of Pages 44

AUGUST 2010

| | | |
|---|---|---|
| 5సం॥ల చందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా:

మేనేజరు

సమర్థసద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by
C.V. Ramana Babu,
on behalf of
YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST
and Printed at
Samardha Sadguru Publications,
D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and
published at
D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - Guda Siva Rama Murthy,


**ఈ సంచికలో....** **పేజీ**


| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మఆశీస్సులు | 3 |
| సంపాదకీయం | 4 |
| బాబూజీ ఉవాచ | 5 |
| మాతాజీఅభిభాషణ | 8 |
| సన్నిధిలోసంభాషణ | 11 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 13 |
| సత్సంగసౌరభం | 14 |
| సంత్‌నామదేవ్ చరితామృతం | 16 |
| శ్రీకృష్ణతత్త్వము, ప్రేమయోగము | 19 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 21 |
| మౌనధ్యాన సప్తాహ శిబిరం | 23 |
| మాతాజీ బోధామృతం | 25 |
| మాతాజీ సత్సంగ్ డైరీ | 27 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 29 |
| సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర | 31 |
| నీవు వినలేని పిలుపే లేదు | 34 |
| ప్రయాణకాలే z పిచ మాం | 36 |
| అమెరికాలో శ్రీ మాతాజీ | 38 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 42 |

# భద్రవాక్యం

బాహ్యామాభ్యన్తరంచేతి ద్వివిధం శౌచముచ్యతే।
మజ్జలాభ్యాంకృతం శౌచం బాహ్యంశారీరికం స్మృతమ్।
అజ్ఞానదూరీకరణం మానసం శౌచమాన్తరమ్
అన్తఃస్థితో భవేత్సమ్యక్ బాహ్యంనావశ్యకం నృణామ్॥

-శ్రీశంకరభగవత్పాదాచార్యులు

శుచిత్వం బాహ్యమని, ఆంతరికమని రెండువిధాలు.శరీరస్నానం బాహ్యశౌచం. మనస్సుయొక్క అజ్ఞానాన్ని దూరంచేయటం ఆంతరిక శౌచం. బాహ్యశౌచం ఆంతరికశౌచం అంత ఆవశ్యకం కాదు అని పై శ్లోకం సారాంశం. కొన్ని గ్రంథాలలో శౌచం మన, కర్మ, కుల, శరీర, వాక్‌శౌచం అని అయిదు విధాలుగాచెప్పబడింది. కపటము మొదలైనవి లేకుండా నిత్యనైమిత్తిక కర్మలను నిష్కామంగా చేస్తూ జీవించటం కర్మశౌచం. కులీనుడై నీచానికి దిగజారకుండా సదాచారంలో స్థిరంగా ఉండటం కులశౌచం. స్నానాదులతో శరీరాన్ని శుభ్రంగా ఉంచటం శరీర శౌచం. సత్యవాక్పాలనం వాక్‌శౌచం. రాగద్వేషాదుల ప్రక్షాళన మనశ్శౌచం. బాహ్యశౌచం అంతరిక శౌచం కన్న చాలా క్రింద మెట్టుమీద ఉంటుంది. స్కందోపనిషత్తులో శౌచం అంటే ఇంద్రియనిగ్రహం అని చెప్పబడింది. శ్రీమద్భగవద్గీతలో శ్రీభగవానుడు తనకు ఇష్టమైన భక్తులలో శుచిని కూడా చేర్చాడు. మరొకచోట శౌచం శారీరక తపస్సుగా చెప్పబడింది. ఇంకో అధ్యాయంలోబ్రాహ్మణుల కర్మలలో శౌచం నాల్గవదిగా చెప్పబడింది.

శుచిత్వం అంటే ఆధ్యాత్మిక శుచిత్వం. మనస్సులో శుద్ధమైన భావాలతో శరీరంతో నిత్యనైమిత్తిక కర్మలను, స్వధర్మాన్ని నిష్కామంగా ఆచరిస్తూ, నిర్మలంగా, పవిత్రంగా జీవించడమే నిజమైన ఆధ్యాత్మిక శుచిత్వం. అంతేగానీ కార్తీక స్నానాలనో, మాఘస్నానాలనో, పదిసార్లు నీళ్ళలో మునగటం లేదా నెత్తిమీద నీళ్ళు దిమ్మరించుకోవటం,తడిమడి, పొడిమడితోఉండటం ఉల్లిపాయలు తినకుండా ఉండటం ఆధ్యాత్మిక శుచిత్వం కాదు.

ఆత్మ అనే నదిలో సత్యం అనే జలం ప్రవహిస్తూ ఉంటుంది. శీలము దానికి ఒడ్డు. అందులో దయ అనే తరంగాలు పుడుతుంటాయి. దానిలో సంయమము అనే పుణ్యతీర్థం ఉన్నది. అందులో స్నానంచేస్తే నీ అంతరాత్మ శుద్ధి అవుతుంది అని మహాభారతంలో ఉన్నది. మనందరమూ ప్రయత్నించి పొందవలసింది అటువంటి ఆధ్యాత్మిక శుచిత్వం మాత్రమే.

# అమ్మ ఆశీస్సులు

ఈశ్వరుడు, గురువు, ఆత్మ ఒకటే. మూర్తిభేదమే. పరబ్రహ్మం గురుశక్తి ఒకటే.ఆ పరబ్రహ్మ లక్షణములు - సత్తు. చిత్తు, ఆనందము, వ్యాపకత్వము. సత్తు - అసత్య నిరాకరణము, చిత్తు - జడత్వ నిరాకరణము, ఆనందము - దుఃఖ నిరాకరణము, వ్యాపకత్వము - పరిఛిన్నత్వ నిరాకరణము. కనపడే ఈ జగత్తు నశ్వరము.అనగా నశించునది. పరబ్రహ్మము శాశ్వతము. అమృతము. సర్వవ్యాపకము.అద్వితీయము. సహజము. సమము, ఏకామృతరసము. ఆ పరబ్రహ్మ స్వరూపుడే గురుదేవుడు. వారే మనను నడిపించేది. వారిఅనంత శక్తి చేతనే మనం మనగలుగుతున్నాము.

నిత్యాయ, సత్యాయ, చిదాత్మకాయ, నవ్యాయ, భవ్యాయ, పరాత్పరాయ ।
శుద్ధాయ, బుద్ధాయ, నిరంజనాయ, నమోZ స్తు నిత్యం గురుశేఖరాయ ॥

-గురుగీత

గురుదేవుడు నిత్యుడు, సత్యస్వరూపుడు, ప్రకాశస్వరూపుడు, శుద్ధుడు, బుద్ధుడు. నిరంజనుడు. అట్టి గురుదేవునకు అనవరతము నమస్కరిస్తున్నాను అని గురుగీత మనకి చెపుతున్నది. ఇన్నిమాటలేల? ఉన్నది గురుశక్తి ఒక్కటే. ఆ గురుశక్తే మనను నడిపిస్తోంది అని గుర్తిస్తే సాధనలో ముందంజ వేసినవారమౌతాము.

శ్రీ గురుదేవుల పరమానుగ్రహంతో జూలై 3,4,5వ తేదీలలో కాలిఫోర్నియోలో(అమెరికా) సత్సంగ క్యాక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. అమెరికా నలుమూలలనుండి భక్తులు ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు.ఇదీ వారి ప్రణాళికే! శ్రీ గురుదేవుల బోధామృతము,శ్రీ గురుదేవుల దివ్యాశీస్సులు వారందరకూ లభించాయి. ఉద్యోగరీత్యా గాని, తదితరకారాణాల వల్లగాని వారు అక్కడ ఉంటున్నా వారందరూ తమ మనస్సులు శ్రీసద్గురుదేవుల చరణారవిందములపై ఉంచి తమ తమ స్వధర్మాలను చేసికొంటున్నారు. "మనస్సు గురు చరణాలపై నిలిపితే ఇక జప తపములేల?'' అన్నది గురుదేవుల మాట. చిన్నారులందరూ ప్రార్థన చెప్పి, గురుదేవ్ రక్షమాం ! గురుదేవ్ రక్షమాం ! గురుదేవ్ రక్షమాం ! అంటుంటే చూడముచ్చటగా ఉంది.

ఇండియా, అమెరికా అన్న దేశ భేదం తీసివేస్తే పృథ్వి,ఆకాశము, వాయువు,అగ్ని, జలము - ఈ పంచభూతాలు అంతటా ఒకటేగా! అందరం ఒకచోట ఉన్నట్లేగా!

ఆ శ్రమానికి తిరిగి వచ్చాక జూలై 20,21,22 చేదీలలో శ్రీ పాండురంగశ్రీశైల ప్రసాద్ గారి ప్రథమ వార్షిక పుణ్యారాధన చేసికొన్నాము. ఆయన ఎక్కడికీ వెళ్ళలేదు. శ్రీ గురుదేవులలో ఐక్యమై అనంతంగా ప్రకాశిస్తున్నారు. మనం జరుపుకొన్న పుణ్యారాధన అంతటా ప్రకాశించే పరబ్రహ్మ వస్తువు ఒకటే అని గుర్తించటానికే.

శ్రీ గురుదేవులు అందరికీ అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యములను, ఆత్మానుభూతిని ప్రాదించుగాక! సుఖీభవ! సుఖీభవ!!

- మీ అమ్మ

# సంపాదకీయం

శ్రీగురుదేవుల పాదపూజలతో, ఏకాహంతో, సత్సంగ కార్యక్రమాలతో, భక్త సమారాధనలతో ఆశ్రమంలో తొలిఏకాదశి, శ్రీ పాండురంగ శ్రీశైల ప్రసాద్ గారి ప్రథమ ఆరాధనోత్సవములు, వ్యాసపూర్ణిమ ఎంతో భక్తిభరితంగా జరుపుకున్నాము. జూలై 28వ తేదీ నుంచి భాగ్యనగరంలో శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో జరుగుతున్న సత్సంగ కార్యక్రమాలు ఈ నెల ఒకటవ తేదీన ముగిశాయి.

తమ అమెరికా పర్యటనను ముగించుకొని ఆశ్రమానికి తిరిగి వచ్చిన శ్రీ మాతాజీ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ, తమపర్యటన ఒక తీర్థయాత్రలాగా నడిచింది అని, దీనికంతా స్ఫూర్తి శ్రీ సద్గురుదేవులే అని, అంతా వారి ప్రణాళిక ప్రకారమే జరుగుతున్నది అని చెప్పారు. సత్సంగం అంటే భక్తులందరికీ శ్రీగురుదేవుల బోధామృతాన్ని పంచిపెట్టటమే. అంటే సత్యవస్తువును గుర్తింపచేయటం. అసలు ఉన్నది అదే. ఈ శరీరం, ఈ జగత్తు అన్నీ అశాశ్వతమైనవే. కాని వీటిలోఉండి వీటిని నడిపిస్తున్న గురుశక్తి మాత్రం శాశ్వతమైనది.

శ్రీ గురుదేవుల వాణి సత్సంగాల ద్వారా అమెరికాలో పలు ప్రదేశాలలో చాలామంది భక్తులను ప్రభావితం చేసింది. అక్కడక్కడ దేవాలయాలలో సత్సంగాలు జరిగినప్పుడు, వారు మన భక్తులతో ఇంతటి చక్కటి కార్యక్రమాలను గురించి మాకు ముందుగా తెలియచేసి ఉంటే ఇక్కడ దేవాలయాలలోకూడా సత్సంగం, సంకీర్తన ఏర్పాటు చేసి ఉండేవాళ్ళం కదా! ఎంతోమంది భక్తులు లబ్ధిని పొంది ఉండేవారు కదా! అన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. చాలామంది సత్సంగం, సంకీర్తన చేయమని ప్రార్థించారు. వారిని అనుగ్రహిస్తూ మున్ముందు జరుగబోయే కార్యక్రమాలను గురించి వారికి తప్పక ముందుగా తెలియబరచగలమని వాగ్దానం చేశాను.

శ్రీ గురుదేవులు మనందరికీ అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యములను, అఖండ సాధనా సంపత్తిని, ఆత్మానుభూతిని ప్రసాదించెదరు గాక! అని దీవిస్తూ తమ అనుగ్రభాషణాన్ని ముగించారు.

- గౌరవ సంపాదకుడు

# బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి)

- స్వామి విజయేశ్వరానంద ప్రసాద్



అటువంటి ప్రేమమూర్తి అయిన కృష్ణ పరమాత్మ కౌరవులకు, పాండవులకు సంధి కుదర్చాలని ప్రయత్నించాడు. కాని దుర్యోధన వర్గంవారు ఆయన్ను నామ, రూప సహితుడైన మానవ మాత్రునిగానే చూడగలిగారు. వాళ్ళ మనస్సు యొక్క స్థితిని బట్టి మాత్రమే ఆయన రూపాన్ని చూడగలుగుతారు గాని ఆయనకు అసలు రూపమెక్కడుంది? అందుకనే తమలో ఉన్న నీచ గుణాలన్నీ ఆయనకు ఆపాదించారు. కాని, భీష్ముడు, విదురుడు, నారదాది మహర్షులు, దేవతలు అందరు కూడా శాంతి స్థాపన కోసం, జగత్కళ్యాణం కోసం ఆరాటపడుతున్న ఆ మహాత్ముని దర్శించుకోవాలని ఎంతో ఆనందంతో కుతూహలంతో, ముందుగానే వచ్చారు. స్వామి తమ విశ్వరూపాన్ని చూపిస్తారని గ్రహించిన జ్ఞానులంతా వచ్చి ఆ కౌరవ సభలో ఒక మూల కూర్చున్నారు. ఆయన ఆకృతి కమనీయ ఆకృతి. సర్వాంగ సౌందర్య స్వరూపాయనమః. సర్వ ప్రకృతిని మోహింపచేసే మోహన రూపం ఆయనది. బాలలను, వృద్ధులను, స్త్రీలను, పురుషులనే గాక పశు, పక్షి, వృక్ష, క్రిమి కీటకాది సమస్త జీవకోటిని మురిపింపజేసే మోహనాకారుడు ఆయన. ఆయనకు జాగ్రత్స్వప్న సుషుప్త్యాది అవస్థలు లేవు. ఆ మూడవస్థలలోను కూడా మానవునికి తన కమనీయ దర్శనంతో శాంతిని ప్రసాదించగల ప్రభువు ఆయన. ఆ రూపాన్ని దర్శించిన వెంటనే దశేంద్రియాలకు శాంతి కలుగుతుంది. వేసవిలో చల్లని గాలి తగిలితే ఎలా హాయిగా ఉంటుందో అటువంటి హాయిని ప్రసాదించగలుగుతుంది, ఆ దివ్య రూపదర్శనం. చల్లనిగాలి, చక్కని రూపం వంటి ప్రకృతి వస్తువులు బాహ్యేంద్రియ తాపాలను తీర్చగలవేమో గాని అంతరింద్రియములైన మనస్సు, చిత్తము, బుద్ధి, అహంకారము, వాటిలో చెలరేగే దుష్టగుణాలు, నీచభావాలు, వాటి వల్ల కలిగే అశాంతిని, తాపాన్ని అవి తీర్చలేవు. అంతరింద్రియ శాంతిని ప్రసాదించగలిగేది ఆ ప్రభువు కమనీయ ఆకృతి దర్శనం మాత్రమే.

అందుకే ఆయనను చూచిన కొద్దీ చూడాలనిపిస్తుంది. అలా ఆయన మీదే దృష్టి నిలిచిపోయినపుడు, చూడాలని, చూస్తున్నామనే భావం కూడా నిలిచిపోయి ఆనందానుభవంలోనే మునిగిపోతాము. అయస్కాంతం ఇనుప ముక్కను ఆకర్షించటంలోనైనా కాస్త ఆలస్యం ఉండవచ్చునేమో గాని, ఆయన కమనీయాకృతి కనులకు సోకిన క్షణమే ఆ చూపును మనస్సును ఆకర్షించి తనలో నిలిపివేసుకుంటాడు ఆ ప్రభువు. ఆ అభయహస్తం దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు సదా సిద్ధమే కాని అందులో అసత్యానికి చోటులేదు. ఆయన నిరాకార, నిరంజన, షోడశలింగ వికార రహిత స్వరూపుడు. ఆ వెలుగు స్వరూపుని మనస్సులో నిలుపుకుంటే అక్కడ ఆనందమే గాని మరొకటి లేదు.

అట్టి పరమాత్ముడు కౌరవ సభకు రాయబారం కోసమై వెళ్ళాడు. అక్కడ దుష్ట చతుష్టయము (అంతఃకరణ చతుష్టయము) అతనికి అపకారం తలపెట్టారు. "వినాశకాలే విపరీత బుద్ధిః. మంచి చెప్పినా వినిపించుకోని మూర్ఖులు వీళ్ళు" ఆ జీవనాధునికి అపకారం తలపెట్టి జీవించాలనేనా వాళ్ళ ఉద్దేశం?" అనుకున్నాడు భీష్మపితామహుడు. సకల జీవకోటి బంధాలను విముక్తి చేయగల ఆ జగద్బంధువును బంధించాలని పగ్గాలు తెచ్చారు మన దుష్ట చతుష్టయం. ఆయన చలిస్తాడా? ఒక్కసారి తన విశ్వరూపం చూపించాడు. అధర్మంచే యోగ్యత లేని దుష్ట చతుష్టయం పటాపంచలైంది. అంతఃకరణ చతుష్టయం హరించిపోయింది. భీష్మ, విదురాది భక్తులు, జ్ఞానులు, మహర్షులు ధృతరాష్ట్రుడు అందరు ఆ దివ్య రూప దర్శనం పొంది ధన్యులైనారు. నిజానికి కరుణామయుడైన శ్రీకృష్ణ పరమాత్మ వాళ్ళ కోసమే తన విశ్వరూప దర్శనం అనుగ్రహించాడు గాని దుర్యోధనాది వర్గం వారి పొగరు అణచటానికి అంత ప్రయత్నమెందుకు? ఆయన చేసే ప్రతి కార్యము మంచికే, అందరిని ఉద్ధరించేటందుకే జరుగుతుంది. దుర్యోధన వర్గం వారు కూడా ఆయన వలన రక్షణ పొందవలసిందే. మరొక మార్గం లేదు. సోమరితనం, నీచభావాలు విడనాడి, ఆయన యందే అచంచల విశ్వాసం నిలిపి ధ్యానించటం ద్వారా మాత్రమే ఆయన దయను పొంది మానవుడు తరించగలడు.

వ్రేపల్లెకు వంద మైళ్ళ దూరంలో ఒక ప్రచండ మహా పండితుడు ఉన్నాడు. ఎందరెందరో వ్రేపల్లెలోని అద్భుత మహిమలు గల బాలుణ్ణి, అపురూప సౌందర్యరాశిని గూర్చి చెబుతుంటే విని, చూడాలని అనుకున్నాడు. కాని "నేను పండితుణ్ణి, పెద్దవాణ్ణి, అగ్రజాతి వాణ్ణి. ఆ గొల్లపిల్లవాణ్ణి చూడటానికి

వెళ్ళానని తెలిస్తే బావుంటుందా?'' అని సందేహం కలిగింది. అయినా, చాలా గొప్ప కార్యాలు చేస్తున్నాడట గదా, ఏమిటో చూడవలసిందే'' అని ప్రయాణమై వ్రేపల్లెకు వచ్చాడు. అక్కడ వాళ్ళను "నందుడి యిల్లు ఎక్కడ?'' అని అడిగాడు. వాళ్ళందరూ "అదిగో ఆ సౌరాష్ట్రం (చౌరస్తా. అంటే నాలుగు రోడ్లు కలిసే కూడలి) ఉంది చూడండి; అక్కడ ఈశాన్యంలో ఉన్న భవనమే; వాళ్ళ వాకిట్లో ఒక ముద్దుల మూటగట్టే బాలుడు ఆడుకుంటూ కనిపిస్తాడు. వాడి ఆకృతి కమనీయంగా ఉంటుంది. ఆ విశాల నేత్రాలు మిమ్మలి యిట్టే ఆకర్షిస్తాయి. ముద్దు మోము గల ఆ మోహనాకారుని చూడగానే మీకు అతన్ని ముద్దు పెట్టుకోవాలనిపిస్తుంది. అదే నందుని యింటికి గుర్తు'' అని చెప్పారు.

జీవుడికి పరమాత్ముడికి వీడదీయరాని లింకు ఉంటుంది. అందువలన ఏ జీవుడికి ఎప్పుడు ఏం జరగవలసి ఉందో పరమాత్మకు ముందుగానే తెలుస్తుంది. ఈ ప్రచండ పండితుడి విషయం, అతను రాబోతున్న సంగతి, అతనికి ఎలా జ్ఞానోదయం కలిగించాలో ముందే తెలుసు గనక, ఆయన నందుని యింటిదాకా వచ్చేసరికి మధుర మందహాసం వెదజల్లుతూ, కృష్ణయ్య ఎదురుగా రానే వచ్చాడు. "అహో! ఎవరీ దివ్య ప్రకాశం వెదజల్లే నవమోహనాకారుడైన బాలుడు? ఓహో! ఆ గొల్లవాళ్ళు గుర్తు చెప్పింది ఈ బాలుడే అయి ఉంటాడు. నేను చతుర్వేదాలు, షట్శాస్త్రాలు సాంగోపాంగంగా చదివాను. కాని వాటిలో కంటె చాలా ఎక్కువ ఆకర్షణ, గొప్పదనం ఏదో యీయనలో కనిపిస్తోంది. ఈ కుర్రవాణ్ణి ఒక్కసారి ఎత్తుకుని, బిగియార కౌగలించుకుని ముద్దాడవలసిందే'' అని ముందుకు అడుగువేశాడు గాని, మాయ అడ్డం వచ్చింది. "బ్రాహ్మణ ముండావాణ్ణి, తీరా యీ గొల్ల కుర్రాణ్ణి ముద్దు పెట్టుకోవటం నలుగురూ చూస్తే - ?'' అని వెనక్కు తగ్గి "యశోదమ్మగారిల్లు యిదేనా బాబూ?'' అని అడిగారు. "అమ్మా! నీకోసం ఎవరో వచ్చారే?'' అని తల్లిని పిలుస్తున్నట్లుగా పిలుస్తూ, వెనక్కి వెనక్కి చూస్తూ, "నా చేతుల్లోకి రానేవచ్చావు. ఇంకెక్కడికి తప్పించుకుని పోతావు లేవయ్యా?'' అన్నట్లుగా చిరునవ్వులు చిందిస్తూ, ఘల్లు ఘల్లుమనే గజ్జెల చప్పుడుతో ఆ పండితుడి గుండెలు ఝల్లు ఝల్లుమనిపిస్తూ, కృష్ణుడు యింట్లోకి పరిగెత్తుకు పోయాడు.

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గతసంచిక తరువాయి)

"ఏది సత్యమో, ఏది అసత్యమో తెలియని ధర్మ సంకటంలో పడి, మూఢచిత్తుడనై, నేనే చేస్తున్నాను అనే కృపణత్వం చేత ఏవేవో ధర్మపన్నాలు వల్లించాను. నన్ను క్షమించు ప్రభూ. నేను నీ శిష్యుడను నీవు నా గురువువు. నాకు ఏది శ్రేయస్సో దానిని ఇక నువ్వుచెప్పు. నువ్వు ఏ త్రోవలో నడిపితే, ఎలా నడవమంటే, ఆ త్రోవలో అలానే నడుస్తాను" అని అన్నాడు అర్జునుడు.



అదే విధంగా మనం కూడా, మన మనసుల్లోని వాసనలనీ, విషయాలనీ గేటు బయటే పెట్టి, ఇక్కడ కూర్చుని శుద్ధమనసుతో మహాత్ముల వాక్కులు విన్నట్లయితే, అవి మన మనస్సుకి పట్టి అందులో రికార్డు చేయబడతాయి. ఈ మామూలు టేపురికార్డర్లు దాని ముందు బలాదూర్! మనలో ఒక దివ్యమైన శక్తి నిగూఢంగా వుంది. దానిని మనం గుర్తించటంలేదు. దానిని గుర్తింపచేసేది ఒక్క గురుశక్తి మాత్రమే. అర్జునుడాశ్రయించినట్టుగా ఒకే గురుపాదాన్ని ఆశ్రయించి ఆ గురుపాద సన్నిధే నిజమైన పెన్నిధని శరణు పొందాలి. అప్పుడు నిజమైన శక్తిని మనం గుర్తించగలుగుతాం.

బయట ప్రపంచంలో అనేకానేక విషయాకర్షణలెదురవుతాయి. 'ఇది కొనుక్కో, అది తిను, ఇంకాస్సేపు పడుకో' అని అనేక విధాల పరీక్షలెదురవుతాయి. అందులో మావంటి వారికి మరిన్ని పరీక్షలు ఎదురవుతూవుంటాయి? 'అయ్యో! మాతాజీ! రాత్రంతా నిద్రలేదు. ఇప్పుడేనా కాస్సేపు పడుకోండి' అంటూంటారు ప్రార్థన వేళప్పుడు! దానికి లొంగిపోతే....ఇకారోజు ప్రార్థన పోయినట్టేగా! ఆ నిద్రలోంచే శాశ్వత నిద్రలోకి వెళ్ళిపోతే ఏమవుతుంది? ఈ జీవితం వుండగానే మాధుర్యాన్ని పొందాలి. జీవితం అయిపోయాక యిక పొందేదేమిటి? ఆత్మానందం ఈ శరీరం ఉండగానే పొందమని మహాత్ములు మనకి అందిస్తున్నారు.

మాబోటివారికి ఎదురయ్యే మరికొన్ని పరీక్షలు గురించి చెబుతాను. ఇప్పుడిక్కడికి వచ్చామా...అనేక రకాల టిఫిన్లు చేసి మా ముందు పెట్టి 'అమ్మా, తమరు రాకరాక వచ్చారు. ఈ ఒక్కసారికి మేము పెట్టినవి మీరు తినితీరాలి' అని బలవంతపెడతారు. ఇవన్నీ మాకు పరీక్షలన్నమాట. మనసాధన ఇంకా సరిగా కొనసాగుతోందా లేక యిందులో వున్న పదార్థాలకి లొంగుతోందా అని వాళ్ళు కూడా మనని చుస్తూ వుంటారు! అక్కడ కూడా గొప్ప మనసులు, తేలికమనసులు కలిగిన రకరకాల వ్యక్తులుంటూ వుంటారు. ఏంతింటున్నారో, ఏంచేస్తున్నారో అని ఆరాలు తీసేవారేగానీ, ఈ ఉపాధి ద్వారా వారికి ఏది వెళుతోంది అని గుర్తించేవారెందరు? ఈ ఉపాధి అందిస్తున్న బ్రహ్మామృతాన్ని ఎవరైనా గుర్తిస్తున్నారా? ఎవరైనా గ్రోలుతున్నారా?

'పిబరే రామరసం' అని అందించారు శ్రీసదాశివ బ్రహ్మేంద్రులవారు. రాముడంటే కేవలం ధనుర్బాణాలు ధరించిన కౌసల్యానందనుడు మాత్రమేనా? కానేకాదు. 'రమ ఇతిరామః' అన్నిటిలోనూ వుండి అన్నిటినీ ప్రకాశింపచేసేది రామతత్వం. మనలోనే వుండి మనం అన్నిటినీ గుర్తించేటట్లు చేసే శక్తే 'రామశక్తి' అని గుర్తించాలి. అది మనదై వుంది. ఆ వెలుగుని ఒక్కసారి మనం చూడగలిగితే మన మనస్సూ సర్వేంద్రియాలూ అక్కడకు వెళ్ళి ఆగిపోతాయి. మన సమాధానం అక్కడుంది.

ప్రశ్నలెప్పుడు వస్తున్నాయి? ఆశ్రయం సరిగా లేకపోతే సందేహాలు వచ్చి ప్రశ్నలొస్తాయి. గురుపాదం పట్టాక, నిజంగా ఆశ్రయిస్తే, ప్రశ్నలెక్కడి నుండి వస్తాయి? మనకేమైనా స్వతంత్రముంటేగా? గురుమూర్తి చెప్పింది చెప్పినట్టు ఆచరిస్తే ఇక సందేహం రావలసిన అవసరమేమిటి? మనసు వెలితిబడుతోంది. సంపూర్ణంగా ఆశ్రయించిన వాడికి ప్రశ్న ఎందుకు వస్తుందసలు? అక్కడ సమాధానమే మిగులుతుంది.

గురువులనాశ్రయించి, వారు చెప్పిన రీతిలో సాధన చేస్తూ, కామక్రోధాది అరిషడ్వర్గాలని, శమదమాది షట్ సంపత్తిగా మార్చివేసుకున్న హృదయం ఎలా వుంటుంది? అటువంటి భక్తుడి ముఖవర్చస్సు ఎలా వుంటుంది? ఆనందలహరిలో ఓలలాడుతూ వుంటుంది. అదీ రామపరబ్రహ్మమంటే! కేవలం గుళ్ళో వున్నవాడే రాముడు కాదు.

'ఆత్మ సంస్థమ్ మన: కృత్వా-న కించిదపి చింతయేత్' అని గీతాచార్యుడు చెప్పినట్లు మనస్సును ఆత్మయందే నిలబెట్టి, ఇతర చింతనలు చేయకుండా ఉండాలి. తనలో వున్న ఆత్మవస్తువుని గుర్తించినవారికి సర్వేసర్వత్రా ఆత్మ దర్శనమే అవుతుంది. అప్పుడిక భేదభావానికి తావెక్కడుంటుంది? శ్రీ శంకర భగవత్పాదుల వారు చెప్పినట్టు 'ద్రష్ట దర్శన దృశ్యాది భావశూన్యైక వస్తుని నిర్వికారే నిరాకారే నిర్విశేషే భిదాకుతః?' ద్రష్ట, దర్శన, దృశ్యాలకీ కారణం ఎవరు? నీలో ఉన్నదే. దానిని గుర్తించినట్టయితే 'ఆ బ్రహ్మమే నేను' అని గుర్తించగలుగుతావు. అటువంటి స్థితిని పొందింపచేసేది గురుపాదం.

అందుకని, 'ప్రభూ! ఈ మాయ నీదయ్యా! అది నీ ఆధీనంలో వుంటుంది కనుక, నేను నిన్ను శరణు పొందుతున్నాను' అని ఆ ప్రభువుని వేడుకొంటే ఆ మాయని దాటిస్తాడు. ఇక అది పోయిందో, వుందో కూడా మనం కనుక్కోనక్కరలేదు. కానీ శరణాగతి 100% సరిగ్గా వుండాలి. అలాకాకుండా, ఏదో గురుదేవులు మంత్రాన్నిచ్చాక కొంత అనుష్ఠానం చేస్తూ, కొందరు అలా అస్పష్టంగా వుంటారు - సంసారాన్ని విడిచి పెట్టలేకా, విడిచి పెట్టినట్టుగానూ వుండి, ఇన్ని లక్షలు జపం చేశామండీ మంత్రాన్ని. ఇంకా చేయాలంటారా? మేము సిద్ధి పొందామంటారా?' అని కొంతమంది గురుదేవులని ప్రశ్నిస్తూవుండేవారు. దానికి గురుమహరాజ్, 'నీ ప్రశ్నలోనే వుందయ్యా సమాధానం!' అని అంటూ వుండేవారు. ఆత్మానందం అంటే అది బయటకి కనిపించేది కాదు. దీనిని మా గురుదేవులు ఆశ్రమంలో ఇద్దరు పిల్లలకి అనుభవపూర్వకంగా బోధ చేశారు.

-సశేషం

## శ్రద్ధాంజలి

ఆశ్రమ స్థిరనివాసి బాదరవాడ సుబ్రహ్మణ్యం (మణెమ్మ-శ్రీ అబ్బిగారి తల్లి) ది.15-07-2010 నాడు గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 84 సంవత్సరములు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె కలరు. శ్రీగురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక!

# సన్నిధిలో సంభాషణ

(గతసంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

ఇప్పుడు నేనని చెప్పుకున్నామే దానిని మీరు ధ్యానం ద్వారా తెలిసికో వచ్చు. ధ్యానంలో భ్రూమధ్యంలో సంచరించే కాంతియే నేను. అదే గురు పరమాత్మ. అండర్‌స్టాండ్? అన్నారు శ్రీబాబు. సమాధి ద్వారా కలిగే ఆనందం కన్న గురుచరిత్ర కీర్తించటం చాల గొప్పది. దీనిని అనుభవ పూర్వకంగా తెలిసికోవాలంటే మీకు ఒక దృష్టాంతం చెబుతాను. మీరు మీ శ్రీమతికి దూరంగా విదేశాలలో ఉన్నారనుకోండి. పాపం! మీ శ్రీమతి మిమ్మల్ని చూడాలనుకుని మీకు ఉత్తరం వ్రాయగానే వెంటనే బయలుదేరి మీ శ్రీమతిని ఎలా కలుసుకుంటారో, అదే విధంగా భగవంతుని ఎడబాటును గురించి తపన చెందాలి. అంతటి తపన చెందాలేగాని, భగవానుడు ఊరుకుంటాడా?

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ సంసారమనే ఎండమావుల సాగరాన్ని దాటటానికి సాధన అనే నావ ఎక్కి ఆ సాగరంలో పూర్తిగా మునిగితే ఆ సాగరం లేదు. సాధన లేదు. తానే మిగులుతాడు. ఇక్కడే మీరు కడు జాగ్రత్త వహించాలి. సాధన లేదు అన్నదాన్ని అపార్థం చేసుకోకూడదు. సంసారసాగరం, నావ, సాధన అన్నీ అదృశ్యమయ్యేవే. ఉన్నది తానే అన్న విషయాన్ని గ్రహించాలి. నేను ఎవరు? అన్న ప్రశ్నకు ఆన్సర్ దొరికేవరకు సాధన ఉంటుంది. కొశ్చన్ నో, ఆన్సర్ నో. అందువలనే గురుదేవుడు శిష్యుడికి మంత్రోపదేశం చేయడానికి అతనిలో ఎంతో ఆవేదన కలిగితేకాని చేయరు.

**27-3-1985**

ఈ రోజు రాత్రి జరిగిన సత్సంగ సమావేశంలో శ్రీబాబు మాట్లాడుతూ మన మూర్తీజీ రిటైరు అవుతాను, రిటైర్ అవుతాను అనటమే గాని, అవ్వరు. పాపం డిప్యూటీ జి.ఎమ్. చేయాలని ఉంది అన్నారు. మూర్తీజీ మాట్లాడుతూ లేదు బాబూ మీరు వద్దంటే చేయను అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ ఆకలి తీవ్రంగా ఉంటే తినవద్దంటే మానుకుంటావుటయ్యా? అన్నారు. శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ ఒక వ్యక్తి తనకు ఉన్నదాంతోనే తృప్తిని పొంది ఎక్కువ ఆశకు పోడు. వేరొకడు ఎంతో తాపత్రయపడి జీవితం అంతా వృథా చేసుకుంటాడు. ఇద్దరిలో ఎవరు గొప్ప అని ప్రశ్నించారు. పరుగులెత్తి పాలు త్రాగటం కన్న నిలబడి నీళ్ళు త్రాగటం

మంచిది కదా! అన్నారు. మానవ జీవితం అంటే చదవటం, పాండిత్యాన్ని సంపాదించటం, ధనార్జన చేయుటం పదవులని చేపట్టటమేనా! అవి గమ్యస్థానానికి చేరుస్తాయా? అన్నారు.

ఇంతలో రావుగారు మాట్లాడుతూ ఆత్మదర్శనం పొందటం ఎలా అని ప్రశ్నించారు. శ్రీబాబు సమాధానం చెబుతూ మానవుడి దృష్టికి పగలు నక్షత్రాలు కనబడవు కదా! పగటివేళ సూర్యకాంతి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. కాబట్టి నక్షత్రాలు మన కంటికి గోచరించవు. సూర్యకాంతి తీవ్రత తగ్గిపోయి, ఉష్ణము చల్లబడిన తరువాత సాయం సమయంలో నక్షత్రాలు కనబడతాయి. అంటే మనకి పరమాత్మకి మధ్యనున్న ఉష్ణం లేక అహంకారం అనే ఆవరణ తొలగినప్పుడు ఆత్మదర్శనం అవుతుంది అన్నారు.

రావుగారు మాట్లాడుతూ నాకు పునర్జన్మ ఉన్నదంటారా? నేను జన్మ కావాలనే కోరుకుంటాను. ఎందుకంటే ఎన్ని జన్మలకైనా మీ బంటుగానే జీవించాలని కోరుకుంటున్నాను అన్నారు.

శ్రీబాబు సమాధానం చెబుతూ మీరు వడ్లగింజ అయితే పునరావృత్తి తప్పదు. బియ్యపు గింజ అయితే మాత్రం జన్మలేదు. ముందు ఆ విషయం తేల్చుకోండి. మీరు భగవంతుని బంటుని అని ఉచ్చరించారు కాబట్టి ఒక స్టెప్ పైకి వెళ్ళినట్లే అన్నారు.

రావుగారు తిరిగి ప్రశ్నిస్తూ మహాత్ములు ఎందుకు జన్మిస్తారు? అని అడిగారు. శ్రీబాబు మాట్లాడుతూ మహాత్ములకు జన్మలేదు. శ్రీరామకృష్ణ పరమహంస, జ్ఞానదేవుడు, శంకరభగవత్పాదులవారు మొదలైన వారంతా కారణజన్ములు. వారు జీవోద్ధరణ నిమిత్తం ఉద్భవిస్తారు. ఆ సబ్జెక్ట్ అర్థం చేసుకోవాలంటే చాల కష్టం అన్నారు.

రావుగారు మాట్లాడుతూ భగవంతుడు మాట తప్పకూడదు కదా! మరి శ్రీకృష్ణపరమాత్ముడు తాను ఆయుధం పట్టనని దుర్యోధనునికి మాట ఇచ్చి భీష్ముని సంహరించటానికి చక్రధారియై ఎందుకు వచ్చాడు? అని అడిగారు.

-సశేషం

# శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**ఆగష్టు 2010**

| | | |
|---|---|---|
| 5 | గురు | శ్రీగురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ. |
| 8 | ఆది | మాస శివరాత్రి |
| 20 | శుక్ర | వరలక్ష్మి వ్రతం. |
| 24 | మంగ | రాఖీపూర్ణిమ, రక్షా బంధనం, శ్రీ సద్గురుపాదపూజ |

**సెప్టెంబరు 2010**

**1 -3 బుధవారము నుండి శుక్రవారము వరకు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు**

| | | |
|---|---|---|
| 1 | బుధ | ఉదయం కలశస్థాపన, శ్రీ రాధాకృష్ణ అర్చన, సత్సంగం, భక్త సమారాధన, సాయంత్రం శ్రీ సద్గురు పాదపూజ |
| 2 | గురు | ఉదయం 05గం. 30ని.లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, ఉదయం10 గం.లకు శ్రీ రాధాకృష్ణ సామూహిక పూజలు, భక్త సమారాధన. |
| 3 | శుక్ర | శ్రీ గురుదశమి, ఉదయం 11 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన. రాత్రి 8 గం.లకు ఉట్టి కొట్టుట |
| 5 | ఆది | టీచర్స్ డే, ఉదయం 10 గం.లకు ఆచార్య దినోత్సవము, శ్రీ సద్గురు పాదపూజ |
| 7 | మంగ | మాసశివరాత్రి. |
| 11 | శని | శ్రీవినాయక చవితి, ఉదయం 5గం.30నిలకు శ్రీ సద్గురు పాదపూజ. ఉదయం11 గం.లకుశ్రీవిఘ్నేశ్వర సామూహిక పూజలు. భక్త సమారాధన. |
| 23 | గురు | భాద్రపద పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ. |

# సత్సంగ సౌరభం

-శివ ప్రసాద్

(గతసంచిక తరువాయి)

వ్యాసులవారు ధ్యానం అంటే ఒక్కమాటలో చెప్పారు ధ్యానం నిర్విషయం మనః అని. అంటే నీ మనస్సులో విషయాలు ఏవైతే ఉన్నాయో వాటిని లేకుండా చేసుకోవటమే ధ్యానం. అలా చేసుకోవాలంటే ఏం చేయాలి? ఏదో ఆలంబనం పెట్టుకోవాలి. ఏ ఆలంబనం పెట్టుకోవాలి? అవయవాలతో ఉండేదాన్ని దేనినీ ఆలంబనంగా పెట్టుకోమని ఏ గురువులూ చెప్పలా. అవయవాలు లేని వస్తువు ఉందే జ్యోతి, దానిని ఆలంబనంగా పెట్టుకో. మా గురుదేవులు చెప్పేవారు, ఉపదేశానికి వెళ్ళినప్పుడు చెప్పేది రామమంత్రమే, శివమంత్రమే, అయినా రాముణ్ణి గురించి, శివుణ్ణి గురించి చెప్పేవారు కాదు. అవయవాలు లేని జ్యోతిని గురించి ధ్యానం చెయ్యమని చెప్పేవారు. దానిని గురించి ధ్యానం చేస్తే, నీవు జ్యోతి స్వరూపుడవై పోతావు.

ప్రపంచ విషయాలలో, సాంసారిక విషయాలలో ఊరి ఊరి వచ్చి, ఒక్కసారిగా పరబ్రహ్మ వస్తువును ధ్యానం చెయ్యాలంటే చాల కష్టం. అది సాధ్యం కాదు. అందువలన నీవు మొదట ఒక ఆలంబనం పెట్టుకో. మన ఇంద్రియాలన్నీ బహిర్ముఖమై ఉన్నాయి. మన మనస్సు విషయాకారమై ఉన్నది. ఒక్క ఈ జన్మదేకాదు, అనేక జన్మల వాసనలన్నీ బాగా పట్టి ఉన్నది ఈ మనస్సు. అవన్నీ పోకుండా ఒకేసారి, ఏక్‌దమ్ పరబ్రహ్మతత్త్వాన్ని ధ్యానం చేయమంటే నీవు ధ్యానం చేయలేవు. అందువలన ఒక ఆలంబనం పెట్టుకో. ఏ ఆలంబనం? రాముడుకాదు, కృష్ణుడుకాదు. జ్యోతి. ఆ జ్యోతిని భావన చేస్తూ నీవు ధ్యానం చేస్తే అది నిజమైన ధ్యానం. అలా చేయగా చేయగా, అప్పుడు ఆ జ్యోతి నీకు పరబ్రహ్మతత్త్వంగా అవగాహన అవుతుంది.

మనస్సులో ఎంత వరకు విషయవాసనలు ఉంటాయో అంతవరకు నీ మనస్సులో ప్రపంచం అంతా ఉన్నట్లే. ఆ వాసనలు పోవాలంటే ధ్యానం చేయాలి. అవన్నీ ఒకేసారి పోతాయా? ధ్యానానికి కూర్చోగానే, ఒక్కసారిగా ఏక్‌దమ్ విషయవాసనలు పోతాయా? పోవు. ఎందుకు పోతాయి? కాని ఎంతకాలంనుంచి ఉన్నాసరే, కొంతకాలానికి అవి తప్పకుండా పోతాయి. కాని ఈ లోపల, అవి పోలేదే అని నీవునిరుత్సాహపడ కూడదు. ధ్యానానికి ఎంతో

మంది కూర్చుంటున్నారు. ఆ కూర్చున్నవారికి ఒక గంటసేపు కూర్చుంటేనే, ఏదో ఒక క్షణమో అరక్షణమో మనస్సులయమౌతుందేమోకాని, గంటసేపూ లయమైనవారు చాలా సకృత్తు. అయినా వదలి పెట్టకూడదు. ఒకవేళ లేచిపోయావా నీ మనస్సు నీవెంటే వచ్చేస్తుంది. నీ మనసు నిలబడినా, నిలబడకపోయినా, నీవు కూర్చుంటే మెల్లగా, క్రమంగా నీ మనస్సు ఆగిపోతుంది. మా స్వామివారు చెప్పేవారు. అరే! ఇప్పటికి ఈ జన్మలో ఇన్ని సంవత్సరాలయిందికదా! సుమారు 20 సంవత్సరాలనుండీ ఆశ్రమవాసం లభించింది కదా? ఈ 20 సంవత్సరాలలో ఎన్ని గంటలు నీ మనస్సుకు ఆధ్యాత్మిక వాసనలు పట్టాయి? ఎన్నిగంటలు ప్రాపంచిక వాసనలు పట్టాయి? దేని బలమెక్కువ? ప్రపంచవాసనల బలమెక్కువ. ఆధ్యాత్మిక వాసనల బలం పెంచుకుంటే, ప్రాపంచిక వాసనల బలం తగ్గిపోతుందనే వారు మా గురుదేవులు. అంతేగాని ధ్యానంలో మనస్సు నిలవటంలేదని మధ్యలో లేచి వెళ్ళకూడదు. కమ్మగా భోజనం చేస్తాము, చక్కగా మంచం మీద పక్క వేసుకుంటాము, నిద్రపోదామని పడుకుంటాము. కాని పడుకోగానే నిద్ర వస్తుందా? మరి నిద్ర రాలేదని లేచిపోతే? నిద్రరాదు. అటూఇటూ పొర్లుతుంటే కొంతసేపటికి నిద్ర అదే వస్తుంది. అలాగే ధ్యానంలో కూడ మనస్సు నిలవలేదు, నిలవలేదు అని లేచిపోతే మనస్సు నిలవదు. ధ్యానం చేయి అంతే.

ఇంకొక మాట కూడ చెప్పేవారు మా గురుదేవులు. ఏమని? ధ్యానం చేయాలి అన్న అభిరుచి నీ మనస్సుకు కలగకపోతే, నీ మనస్సుకు పాపదోషం ఉందన్నమాట. మరి ఆ పాపం పోవాలంటే ఏంచేయాలి? జపతో నాస్తి పాతకమ్. జపం చెయ్యి. ధ్యానంలో మనస్సు నిలవని వాళ్ళు జపం చెయ్యాలి. జపం చేస్తే పాపం నశిస్తుంది. ఆ తరువాత ధ్యానం ఆటోమాటిక్ గా నిలుస్తుంది. ధ్యానం అనేది చాలా ఇంపార్టెంటు. దానికి సమయం కేటాయించు. ఒక గంటో అరగంటో కూర్చొని మనస్సు నిలవలేదంటే నిలుస్తుందా? అంత తేలికగా నిలవదు. ఎందుకు నిలుస్తుంది? ఒకే ఆసనంలో కనీసం మూడు గంటలైనా కూర్చుంటే, ఆ మూడుగంటల కాలంలో మూడు నిముషాలు మనస్సు నిలిస్తే అది చాలా అదృష్టమే అని చెప్పేవారు మా గురుదేవులు.

-సశేషం

# సంత్ నామదేవ్ చరితామృతం

(గతసంచిక తరువాయి) -మనోజ్ కుమార్

చిత్రంగా ఒక మెతుకుకూడ దొరకలేదు. సరే అలాగే తిందామని అన్నం మొత్తం పప్పువేసి కలిపాడు. ఆశ్చర్యం! వేపుడు, కూర, పులుసుముక్కలు, పప్పన్నం అన్నీ బంగారు నాణేలుగా మారి తళతళా మెరుస్తున్నాయి. భట్టుగారు మహదానందంతో అవన్నీ ఉత్తరీయంలో వేసి మళ్ళీ వడ్డన చేయించుకున్నారు. మళ్ళీ అవన్నీ బంగారు నాణేలుగా మారాయి. భట్టుగారు ముట్టినదల్లా బంగారం అవుతున్నది. ఆయనకు మహానందంగా ఉన్నది. అంతలో ఆయనకి ఆకలి గుర్తు వచ్చింది. కడుపులో ఆకలి మాడ్చేస్తున్నది. ఏం తినాలి? దాహం అవుతున్నది. ఏం త్రాగాలి? దేనిని తాకినా అది బంగారం అవుతున్నది. ఔపాసన పట్టటానికి చేతిలో నీళ్ళు పోసుకుంటే అవీ స్వర్ణనాణేలుగా అయ్యాయి. విసిరి అవతల పారేశాడు. గబగబా లేచి అరుగు దగ్గరకు వచ్చి చాపవేసుకు కూర్చోబోయాడు. చాప బంగారం చాప అయింది. తాంబూలం డబ్బీ, తమలపాకులు, వక్కలు, వక్కల కత్తెర అన్నీ బంగారం. వంకికి తగిలించిన అంగీ వేసుకోబోయాడు. అదీ బంగారు అంగీ అయింది. భట్టుగారికి తల తిరిగి పోతున్నది. మెల్లగా ఉత్తరద్వారంలో నుండి ఆయన గుళ్ళోకి వెళ్ళాడు. గరుడ స్తంభానికి ఆనుకుని కూర్చొని పాండురంగడి వైపు చూశాడు. అక్కడి దృశ్యం చూసి భట్టుగారి కళ్ళు తిరిగిపోయాయి. అక్కడ పాండురంగడి బదులు ప్రశాంత ముద్రలో చిరునవ్వుతో చోఖాబా దర్శనం ఇచ్చాడు. ఒక్కసారిగా భట్టుగారిని అంతవరకు ఆవరించిన అహంకారం పొర తొలగి, ఆయన సంస్కారం ఫలించింది. హృదయంలో జ్ఞానజ్యోతి వెలిగింది. ఒడలంతా ఒక అలౌకిక ఆనందంతో పులకించి కంపించింది. అవిరళంగా కన్నులవెంట కారుతున్న అశ్రుధారలలో ఆయనలోని భ్రాంతులు, అంధ విశ్వాసాలు అన్నీ కరిగి కారిపోయాయి. ఆయన పరుగువంటి నడకతో మెట్లు దిగి మహాద్వారం నుండి బయటకు వచ్చాడు. అంతే! మరుక్షణంలో నామదేవుడి పాదాలను గట్టిగా పట్టుకుని ఉన్నాడు. తనలోని అష్ట సాత్త్విక ప్రకృతులు జాగృతమై, శరీరం రోమాంచమై, స్వరం గద్గదమై, ఆనంద బాష్పాలు కారుతుంటే, అలా నామదేవుని పాదాలపైన పడిన భట్టుగారిని చూసి పాండురంగడు ముసిముసి నవ్వులు నవ్వుకున్నాడు.

నామదేవుడు పశ్చాత్తాపంతో దగ్ధమై, క్షాళనమైన హృదయంతో తన పాదాలమీద పడ్డ శంభో భట్టును ఆదరంగా లేవనెత్తాడు. ప్రసన్న అంతః కరణంతో, మృదుమధురంగా విప్రశ్రేష్ఠా! నేను తక్కువ కులం వాడిని. బ్రాహ్మణుడి హస్తాలు శుభాశీస్సులు ఇవ్వటానికి ఉండాలి తప్ప, ఎవ్వడి పాదాలు పడితే వాడి పాదాలు తాకటానికి కాదు అన్నాడు.

శంభో భట్టు ఇప్పుడు పూర్వం శంభో భట్టు కాదు. ఆవేదనతో వినయ వినమ్రుడై ......

**శంభో -** భక్త శ్రేష్ఠా! నామదేవ మహరాజ్! అహంకారంతో, అజ్ఞానంతో కళ్ళు మూసుకొనిపోయి, మీ మాహాత్మ్యం గుర్తించక మీ అంతు చూస్తానంటూ ఏవేవో ప్రేలాను. నానా దుర్భాషలాడాను. అంతా బంగారమే అయితే ఒక్క పూట ఆకలి కూడా తీర్చుకోలేము. మీ కృప వలన నాకు కనువిప్పు కలిగింది. నా పాండిత్యమంతా శాస్త్ర పాండిత్యం, పుస్తక పాండిత్యం. కాని ఈ రోజు అనుభవం కలిగినప్పుడు తెలిసింది 'భగవంతుడికి కావలసింది కులమూ, గోత్రమూ, వర్ణమూ, జాతి, శాస్త్ర పాండిత్యమూ, భోగభాగ్యాలు కావు.' ఈ రోజు పాండురంగడి పీఠంపైన చోఖాబాను చూశాను. ప్రశాంత ముద్రలో ఉన్న ఆ నిర్మలమైన మూర్తిని చూడగానే నా మనోమాలిన్యం అంతా ఎటో కొట్టుకుని పోయింది. హృదయంలో ఉన్న జ్యోతి దర్శనం అయింది. దేవుడికి, భక్తుడికి మధ్య గల అద్వైత సంబంధం నాకు తెలియజేయబడింది. నిజమైన భక్తుడు సదా సదా భగవంతుడికి అభిముఖంగానే ఉండాలి. అవశ్యమూ మీరు నిర్ణయించిన చోటనే చోఖాబా సమాధి నిర్మాణం జరిగి తీరుతుంది. ఈ సత్కార్యానికై నేను మనఃపూర్వకంగా ఈ స్థలాన్ని మీకు ధారాదత్తం చేస్తున్నాను. అనుకున్న ముహూర్తానికి మొదటి గునపం వేసే భాగ్యాన్ని నాకు ప్రసాదించండి.

శంభో భట్టు మాటలకు భక్తులందరూ హర్షం వ్యక్తం చేస్తూ రామకృష్ణ హరీ జయ జయ రామకృష్ణ హరి అంటూ ఉచ్ఛైస్వరంతో నామం మొదలు పెట్టారు. శంభో భట్టు నామదేవుడి చేతిలో ఉదకం వదలి మొదటి మూడు గునపపు పోట్లు తనే వేశాడు. తరువాత ఆయన నామదేవుడి పాదాలు పట్టుకుని "ఈ నాటినుండి నన్ను కూడా మీ వాడిగా స్వీకరించండి. కరుణించి నాకు గురూపదేశం చేయండి" అని ప్రార్థించాడు. పరిసా పళ్ళెంలో పెట్టి తెచ్చిన తులసి మాలను భట్టుగారి మెడలో వేసి గోపీచందనం బొట్టు పెట్టాడు. నామ దేవుడు.

ద్వాదశినాడు నామదేవుడు చోఖాబా అవశేషాలమీద పుష్ప గుచ్ఛం ఉంచి భక్తులనుద్దేశించి "ఈ రోజునుండి ప్రొద్దుటే కాకడారతికి వచ్చే భక్తులందరూ ముందు చోఖామేళుడిని దర్శించి తరవాతనే గర్భగుడిలో ప్రవేశించాలి" అని కట్టడి చేశాడు.

కాలచక్రం వేగంగా తిరుగుతున్నది. ఆషాఢశుద్ధ ఏకాదశినాడు పంఢరి వచ్చిన సావతామాళి వాళ్ళ ఊరు చేరగానే పాండురంగ స్వరూపంలో లీనమైనట్లు వార్త వచ్చింది. ఔంఢ్యా నాగనాథ్‌లో విసోబాఖేచరి బ్రహ్మ పదంతో ఐక్యం అయినట్లు వార్త తెలిసింది. సంవత్సరం తిరగకుండానే నరహరి పరమేశ్వరుడిలో లీనం అయ్యాడు. నామదేవుడిలో మాత్రం స్థితప్రజ్ఞత్వం రోజు రోజుకు అధికమౌతున్నది.

అల్లా ఉద్దీన్ మతదురహంకారంతో దక్షిణ దేశం మీద దండయాత్ర చేశాడు. దేవాలయాలు పడగొట్టాడు. మసీదులు కట్టాడు. ఎక్కడ చూచినా హత్యలు, దోపిడీలు, మానభంగాలు. కలిఘోరాలు రోజురోజుకు మితిమీరుతున్నాయి. ఆషాఢ మాసం వస్తూనే ఆకాశం భూమిపై పర్జన్యాస్త్రం సంధించింది. అంతా జలప్రళయం. చంద్రభాగ పొంగి పంఢరినాథుడి గుడి మెట్లకు తల బాదుకుంది. దశమి తరువాత వాన తగ్గుముఖం పట్టింది. నామదేవుడు పాండురంగడితో "కలియుగపు దెబ్బలు సహించరానివిగా ఉన్నాయి. ఇక ఆలస్యం చేయక నాకు సమాధికి అనుజ్ఞ ఇవ్వు. సమాధి పొందాక నేను భజనలు పాడితే చోఖాబ తాళం వేస్తాడు. అలా కలియుగాంతం వరకు మేము నీ గుణ కీర్తన చేస్తూ ఉండిపోతాము అని ఆక్రోశించాడు. నామదేవుడి కళ్ళు మూతలు పడ్డాయి. గుడి అంతటా కస్తూరి, చందనం పరిమళాలు అలముకున్నాయి. పాండురంగడి చుట్టూ తెల్లని కాంతి వలయాలు. ఘంటానాదం, ప్రమథగణాలు ఊదుతున్నట్లు శంఖారావాలు. గుడి అంతా ఓం కారంతో ప్రతిధ్వనిస్తున్నది.

-సశేషం

## టీ.వీలో శ్రీమాతాజీవారి కార్యక్రమాలు

**శ్రీ మాతాజీవారి కార్యక్రమములు ప్రతిరోజు భక్తి ఛానెల్‌లో ఉదయం 5 గం॥ నుండి మరియు టి.వి -(1) ఛానెల్‌లో 5గం॥30ని॥ నుండిమరియు భక్తి ఛానెల్‌లో అదనంగా ప్రతి శుక్రవారం, శనివారం సాయంత్రం 5 గం॥నుండి ప్రసారమౌతున్నాయి. భక్తులు విని తరించ గలరు.**

# కృష్ణతత్వము, ప్రేమ యోగము

- సుషుమ్న ప్రసాద

(గతసంచిక తరువాయి)

ఆ రోజుల్లో కురుక్షేత్ర సంగ్రామములో కౌరవులను జయించిన తరువాత ఇంద్రప్రస్థ నగరాన్ని రాజధానిగా చేసుకొని, యుధిష్ఠిర మహారాజు ప్రజారంజకంగా, ధర్మపరిపాలన చేస్తున్నాడు. ఒకసారి కృష్ణ భగవానుని సలహా మేరకు, అశ్వమేధయాగము చేయతలపెట్టాడు. యజ్ఞాశ్వమును వదిలిపెట్టారు. ఆ అశ్వము కంఠసీమను ఒక బంగారు పతకముతో అలంకరించారు. ఆ స్వర్ణ ఫలకముపై ఈ విధంగా వ్రాసి ఉన్నది. "ధనుర్ధారి అర్జునుని ఎదుర్కొన గల మహావీరుడెవరైనా ఉంటే ఈ అశ్వమును బంధించి, పార్థునితో సంగ్రామమునకు సంసిద్ధుడు కావలెను. లేనిచో అశ్వమేధ యాగము నిర్ణయించిన రోజు, ఇంద్రప్రస్థమునకు విచ్చేసి కానుకలు సమర్పించి యుధిష్ఠిర మహారాజు ఆతిథ్యమును స్వీకరించి, ధన్యులు కావచ్చును. ఆ అశ్వమును రక్షించుటకు అరివీర భయంకరుడు, నిరుపమాన మహా వీరుడైన ధనుర్ధారి అర్జునుడు, సైన్యముతో బయలు దేరాడు. బయలు దేరేముందు కృష్ణపరమాత్మ తాను కూడ అర్జునుని వెంట వస్తానన్నాడు. అప్పుడు అంతరాంతరములలో తాను గ్రహించని గర్వము ఇంచుక ముఖకవళికల ద్వారా పొడసూపుచుండ "ఈ సామాన్య కార్యమునకు నేను, సైన్యముండగా, మిమ్ములను శ్రమపెట్టుట భావ్యము కాదు అని కృష్ణపరమాత్మకు సమాధాన మిచ్చి, అశ్వమేధ దిగ్విజయ యాత్రకు సన్నద్ధమై బయలు దేరాడు అర్జునుడు. ఈ విశాల భారతావనిలో అర్జునుని పరాక్రమమునకు మోకరిల్లి అశ్వమును బంధించటానికి ఏ రాజుయు ముందుకు రాలేదు. అలా దిగ్విజయ యాత్ర కొనసాగిస్తూ, పాండవ మధ్యముడు మహిష్మతీ నగరము ప్రవేశించాడు.

ప్రవీరుని తండ్రి, మహిష్మతీ రాజ్యాధిపతియైన నీలధ్వజుడు, అర్జునుని పరాక్రమమునకు భీతిల్లి, యుధిష్ఠర సార్వభౌమత్వము నంగీకరించటము మేలైన పని యనుకొన్నాడు. కాని వీరపత్నియైన జ్వాలాదేవి, ఆ సంకట పరిస్థితిలో విజృంభించి, క్షత్రియ ధర్మాన్ని గుర్తు చేసింది. పిరికితనమనేది, క్షత్రియ ధర్మానికి తలవంపులు తెచ్చే మాయని మచ్చయని, ధైర్యసాహసములతో, రాజ ధర్మమును నిలబెట్టు, అర్జునుని రణరంగములో ఎదుర్కొనమని ప్రబోధించింది. కాని నీలధ్వజుడందుకు అంగీకరించలేదు.

భర్త అనుసరించిన పంథాకావెు మ్రాన్పడి, నిరాశజెందినా, రాజమాతగా, క్షత్రియ ధర్మమును నిలబెట్టటమే తన పరమ ధర్మమనుకొన్నది. ప్రవీరుడు కృష్ణ భక్తులలో అగ్రగణ్యుడు. కృష్ణ ప్రేమలో పునీతమై, కృష్ణ నామస్మరణలో ఆత్మార్పణ మొనర్చిన మహాభక్తుడు. తన కంటికి దీపము, ఇంటికి వెలుగైన ప్రియాతి ప్రియమైన తనయుడు ప్రవీరుని సమీపించి, క్షత్రియ ధర్మమును పాటించి, తన ధైర్య సాహసములను, పరాక్రమమును నిరూపించు కొనమని ప్రోత్సహించింది. "బిడ్డా, నీవు నా ప్రాణాధికమైన ప్రియ పుత్రుడవు. కాని రాజ్య ప్రతిష్ఠను, జాతి ప్రతిష్ఠను దేశ ప్రతిష్ఠను కాపాడే బాధ్యత నీది. యజ్ఞాశ్వము, సైన్యముతో బయలుదేరిన మహావీరుడు అర్జునుడు నీకిప్పుడు ప్రత్యర్థి. నీ దేశభక్తిని, స్వేచ్ఛను, పరాక్రమమును, క్షత్రియత్వమును నిరూపించు కొనుటకు ఈ కఠిన పరీక్ష ఎదురైనా నీవు అత్యుత్తమ క్షత్రియ వీరుడుగ, ధీశాలివై, విజయుని రణరంగములో ఎదుర్కొని, విజయలక్ష్మిని వరించమని, ప్రబోధించింది. నీ సోమరితనానికి తిలోదకాలిచ్చి వెంటనే ఉద్యుక్తుడవై, ఉత్సాహముతో మేల్కొని, యజ్ఞాశ్వమును బంధించి, అర్జునుని పరాజితుని చేయి నాయనా'' అని ప్రవీరునికి ప్రబోధించింది జ్వాలాదేవి.

అందులకు ప్రవీరుడు "అమ్మా అర్జునుడు జగదేక వీరుడు. సాక్షాత్తు కృష్ణ పరమాత్మయే సారథిగా గల మహావీరుడని వాక్యము ముగించక ముందే, జ్వాలాదేవి దుర్గాభవాని రూపు దాల్చి, గర్జించింది "అవును, ఆ మహా వీరుడైన అర్జునుణ్ణే ఎదుర్కొనమని చెప్పాను. నీవు పిరికి వానిలా ఎదుర్కొనలేకపోతే, మనసు విప్పి చెప్పు. నేనే స్వయంగా వెళ్ళి, ఒంటరిగా అర్జునుని ఎదుర్కొంటాను, నాకు పుత్రుడే లేడని సరిపెట్టుకొంటాను'' అన్నది.

వెంటనే ప్రవీరుడు మాతృమూర్తి నుద్దేశించి, "అమ్మా, మీకు శిరసా ప్రణమిల్లి, మీ ఆజ్ఞను శిరసా వహిస్తాను. మీరు నిశ్చింతగా, అంతఃపురమునకు తిరిగి వెళ్ళండి" అని సమాధానమిచ్చి, అర్జునునకు " మీ యజ్ఞాశ్వమును నేను బందించాను. మీరు వచ్చి విడిపించుకొని తీసుకొని వెళ్ళవచ్చు" అని సందేశాన్ని పంపాడు.

సందేశమును తీసుకు వెళ్ళిన సైనికుడు అర్జునుని సమాధానముతో తిరిగి వచ్చాడు. దాని సారాంశమిది "ఓ యువ వీరా! నిజమైన క్షాత్రమునకు ప్రతీకయైన నీ లేఖ నాకెంతో మోదమును చేకూర్చింది. అందులకు నీకెంతో కృతజ్ఞుడను. నీవింకా పసిబిడ్డవు. జీవితంలోని ఆనందమును, మధురిమను చూరకొనకుండ, మృత్యుకోరల నాహ్వానించటము భావ్యము కాదు.''-సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

చూడమ్మా ఇంట్లో మంచినీళ్ళు లేవు. కాస్త పక్కింటి పల్లవితో యమునకు వెళ్ళి నీళ్ళు తీసుకురా అనే అత్తగారి మాటలు వింటూ చప్పున కళ్ళు తుడుచుకుంది. ఇవాళ్ళ తనని బైటకి పంపుతున్న అత్తగారి మనస్సులో ఏ రాముడు దూరాడోననుకుంటూ కనబడని ఆ దేవుడికి చేతులు జోడించింది. ఇంతవరకూ తాను చూడని కొత్త అందాలు చూడబోతున్నాననే ఉత్సాహంతో పల్లవితో సాగిపోయింది మందాకిని. ఇన్నాళ్ళూ 'పంజరంలో చిలకలా ఉన్నాను నేను' అంది పల్లవితో. ఎప్పుడూ చీకటే ఉండదు. తప్పకుండా వెలుగు వస్తుంది. ఆ వెలుగుకోసం వెయ్యికళ్ళతో ఎదురుచూసినప్పుడు వచ్చిన వెలుగు విలువ ఉన్నకన్నా ఎన్నోరెట్లెక్కువగా పెరుగుతుంది. ఔను పల్లెకు వెలుగునిచ్చేది ఎవరు మందాకినీ?' అంది పల్లవి. 'పల్లెలైనా ప్రపంచానికైనా పగలు వెలుగునిచ్చేది సూర్యుడు, రాత్రి చంద్రుడు' అంది మందాకిని. 'వారికి వెలుగును ఇచ్చేదెవరంటావు?' అంది మళ్ళా పల్లవి ప్రశ్నిస్తూ. 'ఏమో నాకంత తెలియదు. నేనింకా చిన్నదాన్నే' అంది తలవంచుకుని మందాకిని. నేను చెప్తాను విను. వెలుగులకి వెలుగైనవాడు, తాను స్వయంగా ప్రకాశించేవాడు ఒకడున్నాడు విన్నావా?'' అంది పల్లవి. 'అతడీ పల్లెలోనే ఉన్నాడు. మనందరి కోసం ఉన్నాడు' అని కూడా అంది. నడక ఆపి మందాకిని 'ఇక్కడా? ఎవరతడు' అని అడిగింది ఆశ్చర్యంగా, కుతూహలంగా. తనను తలచిన వారిని, కొలచినవారిని, మనస్సులో నిలుపుకున్న వారి హృదయాలలో చీకట్లు తొలగించి చిరుదీపాలను వెలిగిస్తుంటాడు. నీ పూర్వజన్మ సుకృతం చాలా గొప్పది గనకనే ఈ తావుకు నువ్వు రాగలిగావు. అతగాడి దృష్టిలో నిలిచినందువల్లనే ఈ బ్రహ్మానంద నిలయంలో అడుగుపెట్టగలిగావు.'' పల్లవి మాటలు మందాకినికి మహాద్భుతంగా మరోలోకానికి తలుపు తెరిచినట్లుగా వినిపించాయి. ఆమెకి తన మనస్సు విప్పి చెప్పాలనిపించింది. "నువ్వన్న ఈ దివ్యసీమలో అడుగుపెట్టగానే నాకు కనిపించిన ఆమూర్తి పాదాల అందం నేను మర్చిపోలేక పోయాను. నా మనస్సులో తొలిసారిగా అవి ముద్రించుకు పోయాయి. ఆ శ్యామలమూర్తి రూపాన్ని తనివితీరా చూడాలనుకునే నా కోరిక శాఖోపశాఖలై విస్తరించి మహావృక్షమై నన్ను నిలువనివ్వటం లేదు. నువ్విది నమ్ముతావా పల్లవీ." మందాకిని మాటలలో ఆవేదనను గమనిస్తున్న పల్లవి 'తప్పకుండా

నమ్ముతాను. ఈలీలంతా ఎవరిదో నాకు తెలుసుగనక ఆదివ్యమూర్తిలో ఉండే ఆకర్షణ ఎంత బలమైనదో నాకు తెలుసుగనక.' క్షణకాలం వారి మధ్య మాటలు ఆగి నిశ్శబ్దం అలుముకుంది. అంతలో వారికి వీనులవిందుగా వినబడింది మధురాతి మధురమైన వేణుగానం. ఆగానానికి సమ్మోహిత అయిన మందాకిని తన్మయత్వంతో అరమోడ్చిన కనులతో 'ఎవరిదా వేణుగానం?' అంది. పల్లవి ఆమెని పొదివి పట్టుకుని ముందుకి నడిపించింది. వారు ఆగిన చోట వారికెదురై నిలిచాయి అరవిందాల పొగరణిచే అందాలకు నెలవై ఆపదలనుంచి ఆదుకునే అద్భుత మహిమాన్వితమైన ఆ పాదద్వయం. 'నీ సేవలో తరించడానికి వికసించిన నవ కుసుమం ఇది ప్రభూ! అంది పల్లవి మందాకిని చుబుకాన్ని పుణుకుతూ. 'వికసించిన హృదయాలలో విజ్ఞాన దీపాలను వెలిగించటానికే వచ్చాను నేను.' మందాకిని చెవులలో అమృతం పోసినట్లు వినిపిస్తున్న ఆ మాటలు అర్థం అవుతున్న వేళ కళ్ళుమూసి స్వామి దివ్య చరణారవిందాలపైన వ్రాలి ఉంది .

శ్రీకృష్ణస్వామి దివ్య చరణారవిందాలు వర్ణించలేనంత సంతోషాన్ని నా మనస్సులో నింపుగాక!

- సశేషం

ఒక బ్రాహ్మణునకు స్వప్నము వచ్చెను. స్వప్నమున అతడుఒక జలాశయము వద్దకు జలమును త్రాగుటకు వెళ్ళెను. ఆ సరోవర తీరమున ఒక పెద్ద నేరేడు చెట్టు ఉండెను. దానియొక్క ఒక లావైన కొమ్మపైన ఒక కిరాతకుడు కూర్చుని నేరేడు పండ్లు తిని దాని గింజలు సరోవరములోనికి విసరుచుండెను. ఈ సంగతి బ్రాహ్మణునకు తెలియదు. అతడు తొందర తొందరగా దోసిలితో నీరు త్రాగుచుండెను. ఒకమారు దోసిలిలోనికి నీటితోపాటు నేరేడు గింజ వచ్చి నోటిలోనికి పోయెను.పైకి చూచుసరికి బ్రాహ్మణునకు ఆ కిరాతకుడు కన్పించెను. తాను కిరాతకుని ఉచ్ఛిష్టమును తిని అపవిత్రుడనైతిని అను విచారము అతనికి కలిగెను. దానితోఅతడు మేల్కాంచెను. మేల్కొనిన తర్వాతకూడా అతనికి చాలా పశ్చాత్తాపము కలిగెను. తాను జాతిభ్రష్టుడనైతినని తలచి ప్రాయశ్చిత్తము తెలిసికొనుటకు పురోహితుని చెంతకు వెళ్ళెను. పురోహితుడు తెలివైనవాడు. ఆ కారణముచే అతడు ఇట్లు చెప్పెను. "నీవు స్వప్నమందు ఉచ్ఛిష్టము తింటివి కావున దాని ప్రాయశ్చిత్తముకూడా స్వప్నము నందలి పురోహితుడే చెప్పును."

స్వప్నము మిథ్య. అందుచే సత్ స్వరూపమగు ఆత్మకు ఏ విధమైన దోషమును కలుగదు. కావుననే ఆత్మ నిత్య, శుద్ధ, బుద్ధస్వభావము కలది అని చెప్పెదరు. **- వార్తాలాపము**

# మౌనధ్యాన సప్తాహశిబిరం

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

ఇది చూస్తూ మనం సరిపెట్టుకుంటూ ఉంటే దీనివలన బాధ కాక ఆనందం వస్తుందా? ఎందుకంటే క్షరమైన ప్రపంచాన్ని ఆశ్రయిస్తే ఏ ఒక్కటీ సరిపోయేది కాదు మనకు. ఈమైకే సరిపోతుంది నాకు అంటే, కరెంటు పోతే ఇది ఇనపముక్కై కూర్చుంటుంది. నా గొంతు పోతే, మైకు ఉన్నా లాభంలేకుండా పోతుంది. కొన్ని గంటలపాటు కనుక నేను ఈ మైక్‌కు అతుక్కుపోతే మీరు ఒక్కొక్కొళ్ళే లేచి పోతారు. ఎన్ని ఉన్నై ఇందులో తెరలు? ఇప్పుడు రావలసిన మాటలు ఎట్లా రావాలి? విషయాదులలో ఊరి ఊరి ఉన్నటువంటి మన మనస్సును అందులోనుంచి తీసి మనం భగవన్నామము, భగవత్తత్త్వము, ఏకాగ్రత, మంచి సత్సంగసహవాసము లో ఉంచుకున్నట్లైతే ఏమౌతుంది? అది నిత్య కాలంలో జమ అవుతుంది. అనుకోకుండానే కూర్చోబెడతాడు. కూర్చున్నతరువాత మనస్సు దానంతటదే వస్తుంది. కూర్చోకుండా తిరిగినా వస్తుంది. ఈ శిక్షణ పొందిన తరువాత కూర్చొనే చేయవలసిన అవసరంలేదు. కూర్చోటం అనేది ఒక ట్రెయినింగ్.

నేను ధ్యానం చేస్తున్నాను అని నీవు చేయవలసిన స్వధర్మాచరణంతా మానుకుంటాను అంటే, శ్రమపడతావు అనేవారు శ్రీ గురుదేవులు. నువ్వు చెయ్యవలసిన ధర్మాన్ని నెరవేర్చు. నెరవేరుస్తూ అహంకార మమకారాలు దరిరానీయకుండా చెయ్యి. అప్పుడు అక్షరస్వరూపుణ్ణి నీవు ఎక్కడ ఉన్నా గుర్తిస్తూ ఉంటావు. అటువంటి గుర్తింపే

**గురుకృపాప్రసారమ్మున ద్వారమ్మును తెరుచునే.**

ఎక్కడఉంటే ఏమిటి? Toilet లోనే ఉన్నా, దానికి భిన్నంగానే ఉన్నావు నీవు. అది నీవైతే కదా! నీదేహ లక్షణం. నీవుతింటున్నావేమో ఆపిప్పంతా బయటకు వస్తున్నది. దాన్ని మలం అని విసుక్కుంటున్నావు. మరి నీకు జన్మ తెచ్చే వాసనలను తీసుకొచ్చి, సద్గురువులు, మహాత్ములు ఇది కానిది, ఇది అయినది అని వివేక దృష్టిని మనకలవరుస్తూ ఉంటే, కానిదానిని చెత్తగా చూడాలి, అయినదానిని ఆనందంగా అనుభవించాలి. అందుకని, గురు కృపాప్రసాదమ్మున ద్వారమ్ములుతెరచునే. దానికి ప్లగ్‌లో లూజ్ కనెక్షన్ లేకుండా ఉండాలి. లూజ్ కనెక్షన్ లేకుండా ఉంటే కరెంటు సప్లైద్వారా లైటు

వెలుగుతుంది, ఫాన్ తిరుగుతుంది, మనం అనుకున్నది నెరవేరుతుంది. లూజ్ కనెక్షన్ మనస్సుకు ఉంటే ఏమౌతుంది? జీవితం లూజ్ అయిపోతుంది. ఇంగ్లీష్‌లో లూజ్ అవటం అంటే ఏమిటి? పోగొట్టుకొన్న వాళ్ళం అవుతాము. జీవితం పాడు చేసుకొన్న వాళ్ళం అయిపోతున్నాము.

**తన బోధలవెలుగున శివదర్శనమ్ము చేయించునే.**

ఎవరా శివుడు? ఎవరా గురుదేవుడు? వేదాంతంలో ఒక్కటే ఉన్నది. ద్రష్ట, దర్శన, దృశ్యాది భావ శూన్యైక వస్తుని, నిర్వికారే, నిరాకారే, నిర్విశేషే, భిదాకుతః ఈప్రపంచం ఎవరు చూస్తున్నారు? దర్శించే దృశ్యం ఎక్కడిది? దర్శనం, ద్రష్ట దృశ్యం మూడులేవు. అలాగే జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము అనే త్రిపుటికి ఒక్కటే ఆధారం కానీ, మూడులేవు అక్కడ. మూడుగా కనిపించటం కేవలం మాటలలో వ్యవహారదృష్టిలోనే గాని, అనుభవానికొచ్చేసరికి ఒక్కటైఉన్నది.

కాబట్టి అటువంటి స్థితి, ఏకాగ్రత కోసం భక్తులు ఆవేదన చెందుతూ పాడుకున్న పాట అది. ఎవరి దగ్గరో ఎందుకు? ఏడిస్తే నిజంగా భగవంతుడి దగ్గరే ఏడవాలి. చాలామంది దగ్గర ఏడుస్తాం. కొంతమంది మంచిగా తీసుకోవచ్చు. కొంతమంది చెడుగా తీసుకోవచ్చు. లేకపోతే ఏడుపుగొట్టుముఖం ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటుంది, అంటారు కొంతమంది. ఎవరిదగ్గరో ఏడిస్తే అలాగే ఉంటుంది. మనసాధన గురించి, మనం తరించాలి అనేబాధ ఎక్కడ పడాలి? అక్కడే పడితే ఆ బాధకూడ ఏమౌతుంది? దానిని ధ్యానంగా మారుస్తాడు ఆయన. అర్జునుడు ఎక్కడ ఏడ్చాడు? ఆ గుడారంలో ఉన్నంతసేపు ధర్మరాజు దగ్గరో, తన అన్నల దగ్గరో తమ్ముళ్ళ దగ్గరో ఏడ్వవచ్చుగా? ఏడ్వలా? చాలామంది ఉన్నారు యుద్ధానికి వచ్చిన వాళ్ళు. వాళ్ళందరిముందు ఏడ్వవచ్చుగా? ఏడ్వలా. శ్రీ గురుదేవులు తమతో మనకు చాలా దగ్గర రిలేషన్ ఏర్పరచారు. మనందరి యొక్క ప్రశ్నలన్నీ అడిగి, అక్కడ మనందరి ప్రతినిధిగా అర్జునుడే నిలబడ్డాడు. ఎవ్వరి దగ్గరో ఏడ్వలా అర్జునుడు. ఎవరి దగ్గర ఏడిస్తే ఇక ఏడ్వవలసిన అవసరం ఉండదో అటువంటివాడి దగ్గరే ఏడ్చాడు. మొత్తం అంతా ఒలకపోసుకున్నాడు. అంతా ఓపికగా విన్నాడు కృష్ణయ్య. సమాధానం అందరికీ తెలిసున్నదే. అలాగే మనం సమయం చూసి తగిన వారి దగ్గర ఏడ్వాలి. ఉత్తుత్త కన్నీళ్ళు కారిస్తే వారికి వెంటనే తెలిసిపోతుంది. మన జీవితాలకు ధ్యాన ప్రక్రియలో తురీయమైన సమాధి స్థితిని, అఖండ సాధనా సంపత్తిని, ఆత్మానందమును శ్రీ సద్గురు గురుదేవులు మనందరికి ప్రసాదించెదరుగాక!

# మాతాజీ బోధామృతం

(గతసంచిక తరువాయి) - శివ ప్రసాద్

( శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ కోదండ రామస్వామి వారి ఆలయంలో ది. 28-09-09 శ్రీ మాతాజీవారి అనుగ్రహ భాషణకు సంగ్రహ రూపం)

వాన వాన వల్లప్ప ఆటలో చిన్నపిల్లవాడు తండ్రిచేయి పట్టుకొంటే, ఏదో ఒక రోజున వాడు పడి పోవచ్చు. కాని చిన్నపిల్లవాడి చేయి తండ్రి చేతులో ఉంటే! ఎంత స్పీడ్ (speed) గా తిరిగినా, పడిపోడు. మనమే భగవంతుడి చుట్టూ తిరుగుతున్నాము. మన చేయి ఎక్కడ ఉన్నది? అన్నీ మనమే చేస్తుంటే దానికి భగవంతుడు బాధ్యుడు అవుతాడా? అన్నీ భగవంతుడే చేయిస్తుంటే, భగవంతుడు దుష్కృత్యాలు చేయిస్తాడా? అన్నిటికి ఆ భగవంతుణ్ణి ఆశ్రయిస్తే తెలుస్తుంది. భగవంతుడు తప్పు చేయనీయడు. మనమే చేస్తే, అయ్యో తప్పు చేశామే అనే భావం మనకు ఉంటుంది. భగవానుడు భగవద్గీతలో -

**అనన్యాశ్చింతయంతోమాం యేజనాః పర్యుపాసతే**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥**

అన్నాడు . అన్ని భావములలో కీడు కూడ ఉంటుంది. చంటిపిల్లను తల్లి ఎంత పట్టించుకుంటుంది? అయినా మన తల్లి చేతిలో మన చేయి ఉంటే ఫరవాలేదు. సూర్‌దాస్ ప్రార్థన చేయలేదా! సూర్‌దాస్‌కు చర్మచక్షువులు లేవు. కాని నిరంతరం కృష్ణ స్మరణలో ఉండేవాడు. ఆయనకు వృద్ధాప్యం వచ్చింది. కృష్ణుడే ఒక బాలుని రూపంలో వచ్చి, ఆయనను రెంటికి, ఒకటికి తీసుకొని వెళ్ళి వచ్చేవాడు. తాతయ్యా! పాట బాగుంది అని పాడించుకొని, పాడుతూ, పాడిస్తూ, ఆడుతూ, ఆడిస్తూ ఉంటే ఆ అనుభవం ఎంత గొప్పది!

**తుమ్ తజ్ ఔర్ కౌన్ పే జావూఀ**
**కాకే ద్వార్ జాయి సిర్ నావూఀ**
**ఐసో కో దాతా హై సమరథ్ జాకే దియే అఘావూఀ**
**అంతకాల్ తుమ్హారే సుమిరన్ గతి దియో అభయపద్ ఠావూఀ**
**కీజే కృపా సుమిరౌ అపనో పన్ సూరదాస బలిజావూఀ**

ఆనాడు సూరదాస్ చేత ప్రభువు ఈ కీర్తనలన్నీ పాడించారు, ఆనందించారు. ఈనాడూ అందరూ ఆనందిస్తున్నారు. కన్నులున్న మన చేత ఈనాడు ఈ పాటలు పాడించుకుని, ఆనందిస్తున్నారు గురుదేవులు.

నిన్ను విడిచి నేను ఎక్కడికని వెళ్ళను? నాకు కావలసిన విషయాన్ని ఎవరు ఇవ్వగలరు? వాళ్ళ పనులలో వాళ్ళుంటారు. అయినా శాంతిని ఎవరు ఇవ్వగలరు? భారవి అనే మహాకవి ఉండేవాడు. ఊళ్ళో అందరూ, అతని కవిత్వాన్ని గురించి చాల గొప్పగా చెప్పేవారు. కాని తండ్రిమాత్రం తన కవిత్వం గురించి ఏమీ అనకుండా, కాళ్ళు కడుక్కొని వస్తే భోజనం చేద్దాము అనో, లేకపోతే ఇందాకనే భోజనం అయింది అనో చెప్పేవాడు. ఆ రోజులలో నాన్నగారంటే చనువుండేది కాదు. అప్పుడు నాన్నగారు పైన కూర్చుంటే, వీడు క్రింద కూర్చున్నాడు. ఇప్పుడు నాన్నా! నేను ఆఫీసులో అలసిపోయి వచ్చాను, ఈ సోఫాలో నేను కూర్చుంటాను, మీరు లేవండి అంటాడు. ఆధునిక ప్రపంచంలో ఇప్పుడు నాన్నగారు అనే పలుకే వినబడటం లేదు. డాడీ అనో పాపా అనో పిలుస్తున్నారు. అమ్మను మమ్మీని చేశారు. అమ్మ అంటే బ్రహ్మత్వాన్ని ప్రసాదించేది. అమ్మ అంటే ఎంత గౌరవం! మనం మన సంప్రదాయాన్ని గౌరవాన్ని నిలబెట్టుకోవాలి. అన్నీ కలగూరగంప వలె కలుపుకుంటున్నాము. కట్టు, బొట్టు, మాట, సంస్కారం మంచివై ఉండాలి. నాన్నగారు అంటే గౌరవభావం ఉండాలి. మీ నాన్నగారు కొడితే ఒకటికే, నేను కొడితే రెంటికి పోతావు అనేవారు గురుదేవులు. మా నాన్న చేత నేను కమ్చీ దెబ్బలు కూడ తిన్నాను. కాని కొడితే తిరగబడి కొడ్తారు అనేటట్లు ఉంటే ఏం లాభం? ఇప్పుడు ఇక్కడ కూడ వస్తున్నై వృద్ధాశ్రమాలు. పిల్లలు ఉన్నా కష్టమే. మొన్న ఒక వృద్ధాశ్రమంలో ఒకామెను కలిశాను. కొడుకు వచ్చి పోయి నాలుగేళ్ళయింది, మళ్ళీ రాలేదు అని వాపోయిందామె. ఆయనకు ఉద్యోగం. నేను డాక్టర్ని. పిల్లలని మా దగ్గర పెట్టుకొన్నామంటే బంధనే అన్నదొకామె. ఆశ్రమాన్ని ఆశ్రయించిన వారు ఏం కోరుకుంటారు? ఇక్కడ అన్నీ గురుదేవులే చూస్తున్నారు. వారి గొప్పతనం ఎంత చెప్పుకొన్నా తరిగేది కాదు. బయట తుఫాన్లు వచ్చినా, ఆశ్రమంలో వాటి ప్రభావం ఉండదు. బయట కరెంటు పోయినా మనకు కరెంటు ఉంటుంది. పిపీలికాది బ్రహ్మపర్యంతము సుఖాన్ని ప్రసాదించేది ఒక్కరే. అది గురుదేవులు. ఆశ్రమంలో గడపాల్సిన ధర్మాన్ని నీవు నిర్వర్తించాలి. అది గురు ధర్మం. ప్రభూ! ఈ ప్రపంచంలో ఎవ్వరి వద్ద శిరస్సు వంచను. ఈ ప్రపంచంలో నీ ద్వారం కాదని ఏ ద్వారం వద్ద శిరస్సు వంచేది? అయినా నీ అంత దాతలు ఎవరున్నారు. నీవు కనుక, ఎవరైనా వస్తే నీవు తింటున్నది కూడ పంచి పెడ్తావు. నిజమైన దాతలు వాళ్ళు. -సశేషం

# మాతాజీ సత్సంగ్ డైరీ

(గతసంచిక తరువాయి) -రమణ ప్రసాద్

అందరూ ఎట్లా ఉన్నారు? చాకులు. కనిపించటానికి తలలు నెరిసి ఉంటాయి. కాస్త కుర్చీలలో కూర్చున్నారేగాని, వెళ్ళి వాళ్ళను గిల్లండి మీకేం కావాలో. కాకపోతే అక్కడ కూడ ఒక మాయ చోటు చేసుకొంటుంది. ప్రశ్నలేసే వాణ్ణి బట్టి ఉంటుంది సమాధానం ఎప్పుడూ. ఎందుకంటే శాస్త్రం చెప్పింది కదా! ప్రశ్నలేసే వాణ్ణి బట్టి సమాధానం వస్తుంది అంటారు కదా! అలాగే, మా గురుసోదరుల దగ్గరకేంటి, అనుభవం ఉన్న వ్యక్తుల దగ్గరకైతే ఏమిటి? వారి దగ్గరకు వెళ్ళి, మనం వేసే ప్రశ్నను బట్టి ఉంటుంది వారి సమాధానం. ఏమండీ! మీ పిల్లలూ అందరూ బాగున్నారా? ఆ బాగున్నారు. మీరు కూడా బాగున్నారా? ఎప్పుడొచ్చారు? మీ ఇంట్లో ఏం కూర? ఇవన్నీ వస్తై. బాబూజీ! అప్పుడు చెప్పింది మీరు ఎంత బాగా చెప్పారు? బాబూజీ గురించి అప్పుడు మీరు చెప్పింది ఒక్కసారి మళ్ళీ చెప్పరా అని గనక ప్రశ్న మొదలు పెడితే, అప్పుడు దానిని గురించే వస్తుంది. దాని మీదుగా, తత్త్వపూరితంగా లోపలికి వెళ్తే, స్వామి అనే శ్రీగురుదేవుల చరిత్రలోగాని, గురుదేవుని తత్త్వంలోగాని, ఈర్ష్యా అసూయలకుగాని, కామక్రోధాది గుణాలకుగాని, ద్వంద్వమనే వాటికి ఎక్కడైనా చోటున్నదా? ఒక్కసారి ఆలోచించండి. భగవత్తత్త్వం దగ్గర ఎప్పుడు కూడ మాయకు చోటు లేదు. మనందరికి సంతృప్తిని ఇచ్చేది ఒక్కటే ఉన్నది. అది, ఏదంటే, నిరంతరం భగవన్నామస్మరణ, గురునామస్మరణ, గురుతత్వానుభూతి. అటువంటిది గుర్తు చేయటానికే, పూర్ణిమలాంటి మనసులకు. పూర్ణిమ ఆకాశంలో వస్తే చాలదు. వైశాఖ మాసంలో వస్తే చాలదు. మరేం కావాలి? ఆ రెండిటి సమన్వయము మన మనస్సు పొందాలి. ఆ రెంటినీ మనకు అదృష్ట వశాత్తు, ఈ జీవితంలో ఇటువంటి పూర్ణిమలు వచ్చినప్పుడెల్లా - అంటే పూర్ణిమలు వచ్చినప్పుడే పొందాలా? నిన్న వద్దు, రేపు వద్దా? - పూర్ణిమలు అంటున్నారుగా? ముందంతా ప్రిపేర్ అయితే, అప్పుడేమౌతుందో ఇప్పుడూ అదే అవుతుంది. పూర్ణిమకు తేడా ఉంటుందా? నిన్నటిదాక ఉంటేనే కదా? నిన్నటిదాక మీరు ఇక్కడికి రావాలని ప్రయత్నం చేశారు, ఇదిగో ఇవాల్టికి వచ్చారు. ఇక్కడున్నవాళ్ళు పాపం పనులవల్ల గబగబా రాలేకపోయారు, కొంతమంది వచ్చారుగాని, బయట ఊళ్ళనుంచి వచ్చినవాళ్ళు శ్రద్ధగా ముందు

వచ్చి కూర్చున్నారు కదా? మరి ఎన్నాళ్ళ ప్రయత్నం అది? ఎప్పటిబట్టీ అనుకుంటుంటే, మఱి గురుపూర్ణిమకు సమయానికి వస్తున్నాము? ఇప్పుడు ఇది నిత్యకాలంలో జమ. శ్రీ గురుదేవుల సన్నిధిలో, పంచదార చిలక, ఎటుపక్కనించి కొరకండి, మాధుర్యమే!

తెల్లవారుజామున వచ్చి కూర్చున్నాము. కూర్చుంటే ఎవరికి ఆనందం? మేము తలుపు వేసుకుని, ఇంట్లో నిద్రపోతాం దుప్పటి ముసుగుతన్ని, అని ఆశ్రమంలో ఉన్నా, నీ బ్రతుకు ఎక్కడ ఉంటుంది? నీ బ్రతుకు, నీ దేహభావన అనే దాంట్లో కరుడుకట్టుకొనిపోయి, గురుపూర్ణిమను కూడ మరచిపోతుంది. ఎంతసేపూ, ఈ దేహానికీ, ఈ ఇంటికి పనులు చేస్తూ వస్తున్నావు. చేస్తున్న కొద్దీ ఇంకా చేయించుకుంటూనే ఉంటుంది. రోజంతా సర్దుతున్నా సర్దుతూనే ఉంటాం. ముప్పై రోజులనుంచీ ఆలోచిస్తున్నా ఆలోచిస్తూనే ఉంటాం. ఇప్పుడు సర్దుకున్నా కూడా - ఇప్పటికిప్పుడు పూలు పెట్టి సర్దుకొనే వాళ్ళుంటారు ఇక్కడ. నేననుకుంటాను, హమ్మయ్య ఆఖరి క్షణంలో వచ్చి నానెత్తిన పాలు పోశారనుకుంటాను. ఉన్న పూలలోనే సర్దుతారు, ఉన్న పళ్ళెంలోనే సర్దుతారు. చక్కగా అందులోది ఇందులో, ఇందులోది అందులో సర్దుతారు, అయిపోతుంది.

గురుదేవులు అంటుండేవారు, భక్త విజయం చదివిచూడండి, ఎట్లా ఉంటుందో. భక్తులు ఎలా సేవ చేసుకున్నారో తెలుస్తుంది. తాము చేసుకున్న ఆ పూజకు, తాము చేసుకున్న సేవకూ, తామే చేసుకున్నారు ప్రతిదీ కూడ. అన్నీ అమర్చిపెడితే వచ్చి చేసుకోవటం గొప్పకాదు. ఒక్కొక్కపువ్వు మనం పెట్టుకుంటే, అది మనతో మాట్లాడుతుంది. దేవుడి దగ్గరకు వెళ్తున్నానని ఆనందంగా మనవంక చూస్తుంటుంది. ఎందుకంటే అమ్మకూడ మల్లెపూల కాలంలో, తరచూ దండ గుచ్చుకుంటూ ఉంటుంది. అమ్మే వెయ్యనక్కర్లా. ఎవరైనా వేయవచ్చు. కలిపేవారు ఎవరైతే ఏమిటట? ఒక పువ్వు తొడిమ తీస్తుంటే, ఆ పువ్వు ఆనందంగా డాన్సు చేస్తూ ఉంటుంది, దేవుడి దగ్గరకు చేరుస్తున్నారా అని. మనం కూడ తొడిమలు తీసేసుకోవాలి. మూలంలేకుండా, మళ్ళీ జన్మ లేకుండా, తల్లి నుంచి బిడ్డ బయటకు రాగానే, ఎలా బొడ్డుకోసి, తల్లినుంచి విడగొడ్తారో, అలా. అలాగే ఇక్కడ భగవంతుడి దగ్గరకు వచ్చిన తరువాత కూడ, పూర్వజన్మ వృత్తాంతము, మరుజన్మ వృత్తాంతము, అన్నిటినీ తీసి పక్కన పెడ్తే, ఉండేదేమిటి? అంతా ఒక్కటే. దానినే ఏకంసత్, విప్రా బహుధా వదంతి అని శ్రుతి చెప్తుంది. ఇంకా చాలా రకాలుగా చెప్తుంది. -సశేషం

## శ్రీ బాబూజీ దివ్యవాణి

ముస్లింల దండయాత్రలు సంప్రాప్తమై మనదేశం విపద్దశలో నుండిన కాలంలో దానికి సముచితమైన ప్రతిక్రియ చేయగలిగినాడు గురునానక్. ఆయన సమతాభావం, విశాల దృష్టి, కడు యుక్తియుక్తములై, ఇటు హిందువులకు, అటు ముస్లిములకూ కూడా ఆమోదకరములూ, సమ్మానములూ అయినాయి.

మొదటి మొఘల్ ప్రభువైన బాబర్ గురునానక్‌ను తన సొంత గురువుగా సంభావించేవాడని చెప్పబడుతున్నది. ఇస్లాం మతానికి మూలస్థానమైన మక్కాలోని ముసల్మానులు కూడా నానక్ యెడ విశేష గౌరవ భావం కలిగి, ఆయన పేరున మక్కామసీదు సమీపంలోనే ఒక స్మారక చిహ్నమును నెలకొల్పినారంటే, ఆయన ఎంతటి మహాత్ముడో మనం గ్రహించవచ్చు.

బాబర్ మనుమడైన మొఘల్ చక్రవర్తి అక్బర్ మరింత అదృష్టశాలి యని చెప్పవలె. ఏలనంటే, తులసీదాసు, మీరాబాయి అనే ఇద్దరు మహాభక్తులకు ఆయన సమకాలికుడు. వారి దర్శనమును, ఆశీస్సులను పొంది, అతడు ఉత్తేజితుడై అల్లాను మరింత భక్తిభావంతో ఆరాధించడం నేర్చుకున్నాడు. పూర్వజన్మలో అతడొక యోగ భ్రష్టుడని నిశ్చయంగా చెప్పవచ్చును.

దక్షిణ భారతదేశం చిన్న చిన్న రాజ్యములుగా చీలికలై, సంకుచితులగు పరిపాలకులు పరస్పరం కలహించుకుంటూ, స్వకీయ ప్రాచుర్య విస్తరణాభిలాషులగు ముస్లిం ప్రభువుల చేతులలో ఆటబొమ్మలయ్యే దుస్థితి యేర్పడినప్పుడు, శ్రీ విద్యారణ్యస్వామి పరిస్థితులను చక్కదిద్దే పనికి పూనుకున్నాడు. మహిమోపేతమైన సమాలోచనా ఫలితంగా ఆయన సిద్ధమొనర్చిన ప్రణాళిక ననుసరించియే విజయనగర సామ్రాజ్య ప్రతిష్ఠాపన జరిగింది. కాని, దురదృష్ట వశాత్తూ, అనుల్లంఘ్య విధి ప్రాబల్యం వలన ఆ సామ్రాజ్యం రెండు శతాబ్దాలను మించి నిలువజాలక పోయింది.

కాని, ఈ రెండు శతాబ్దాల కాలంలో ముఖ్యంగా శ్రీకృష్ణ దేవరాయల హయామున ఒక స్వర్ణయుగమే ఇచట విలసిల్లినది. కృష్ణదేవరాయలు అపజయ మెరుగని వీరాధివీరుడగుటయేగాక, గొప్ప పండితుడు, కవియు కూడ. ఉత్తమ శ్రేణి కవులలో ఒకడుగా ఆయన చిరకీర్తి నార్జించుకున్నాడు. సువిశాల హృదయుడుగా, మేటి లలితకళాపోషకుడుగా ఎన్నిక గాంచినాడు. ఆయన సాధించిన ఘన విజయముల కన్నింటికీ మూలభూతమైనవాడు తన సునిశిత

దూరదృష్టితోడనూ, అసమాన సాహిత్య ప్రజ్ఞతోడనూ, తండ్రివోలె సదా ఆయనను కాపాడుతూ వచ్చిన మహామంత్రి తిమ్మరుసు.

శిరస్సువంటివాడైన కృష్ణదేవరాయలకు మెదడు తిమ్మరుసే. విజయనగర సామ్రాజ్య మహోన్నతికి ముఖ్య కారకుడాతడు. తిమ్మరుసే లేనియెడల, చుక్కానిలేని నౌకవంటిదయ్యేది ఆ సామ్రాజ్య స్థితి.

భారతదేశ చరిత్రలో మరొక స్వర్ణయుగం సృష్టించినవాడు శివాజీ మహారాజు. అందుల కాతనికి ఉత్సాహప్రోత్సాహములను సమకూర్చినవాడు అతని గురువు సమర్థ రామదాస స్వామి. గురువుయెడ అతని భక్తి విశేష మెంతటి దంటే, తాను నిర్మించిన రాజ్యమును తనతో సహా గురుదక్షిణగా గురువు పాదములకడ నాతడు సమర్పించుకొన్నాడు. పిమ్మట ఆ గురుదేవుని ఆదేశానుసారం ఆయనకు ప్రతినిధిగా మాత్రమే సింహాసనముపై గురుపాదుకల నుంచి ప్రజా పాలనము సాగించినాడు. శ్రీరామునియెడ భరతుని భక్తిని తలపింపచేసే గురుభక్తి అతనిదన్నారు శ్రీ హనుమత్కాళీ వరప్రసాద బాబూజీ మహరాజ్. *

ఒకనాడు సమీపముననున్న నగరమునుండి ఇద్దరు, ముగ్గురు గృహస్థులు తమ సందేహములను నివారణ చేసికొనుటకు కబీరు వద్దకు వచ్చిరి. ఆ సమయమున కబీరు నేత నేయుచుండెను.

వారు ప్రశ్నించిరి."జ్ఞానమును సంపాదించుకొనుట గృహస్థాశ్రమము నందు సులభమా? సన్యాసాశ్రమమునందు సులభమా?"

ఇంతలో ఆయన భార్యను ఆజ్ఞాపించెను." త్రాడు తెగినది. అతుకుటకు దీపము తీసికొని రమ్ము." ఆమె దీపము తీసికొని వచ్చెను. త్రాడును అతికిన తరువాత కబీరు భార్యతో చెప్పెను. "దీపము తీసికొని వెళ్ళుము." ఆమె ఆ ప్రకారము చేసెను. అనంతరము కబీరు ఆగంతుకులతో చెప్పెను. " మీ సందేహమునకు సమాధానము వచ్చినది. నా భార్య దీపము తీసికొని వచ్చినది. మరల దీపము తీసికొని పోయినది." గృహస్థులు అడిగిరి. "స్పష్టముగా తెలియజేయుడు." ఆ మహాత్ముడు పలికెను. "ఇట్టి పతివ్రతయగు భార్య ఉన్నచో గృహస్థాశ్రమమునందుకూడా సులభముగా జ్ఞానము కలుగును. జ్ఞానము లేని భార్య ఉన్నచో ఈ విధముగా పట్టపగలు కూడ దీపము తీసికొని రమ్మని ఆజ్ఞాపించినప్పుడు ' ఏమి కన్పించుట లేదా? రాత్రియో, పగలో తెలియుట లేదా? ' అని అడుగును. కాని ఈమె నా ఆజ్ఞను వేదవాక్యముగ తలచి దీపము తీసికొని వచ్చి హాజరైనది. ఇటువంటి భార్య ఉన్న వ్యక్తి యొక్క జీవితం సుఖముగా గడచును.

**- వార్తాలాపము**

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

తరువాత శ్రీకాళీ గార్డెన్స్ స్థాపన అనంతరం ఆమె 1976లో ఆశ్రమానికి ఒకసారి వచ్చారు. శ్రీబాబు దర్శనం కూడా చేసుకున్నారు. కాని వెనుకటి వలె స్వతంత్రంగా, చనువుగా, లాలనగా సంభాషించుకునే భాగ్యం దక్కలేదు.



దుఃఖాన్ని దిగమింగుకుంటూ ఆమె "ఉప్పాడకు మళ్ళీ రండి బాబూ!" అన్నారు. శ్రీబాబు "నన్ను మీరు ముంజవరపుకొట్టుకు వెళ్ళమని బలవంతం చేసినప్పుడే, నేను మళ్ళీ ఉప్పాడ రానని చెప్పాను. మేము ఇక్ష్వాకు వంశస్థులం. ఆడిన మాట తప్పం. నేను ఉప్పాడ రానన్నాను కాని, మిమ్మల్ని నా వద్దకు రావద్దని అనలేదు, అనను కూడా. రాజమండ్రి జయంతులలో మీరు ఏదో అపోహతో ఆత్మహత్యా ప్రయత్నం చేస్తే, జగన్మాత కృపతో మిమ్మల్ని రక్షించుకో గలిగాను. కాని దేహాభిమానం అడ్డువచ్చి మీరు ఆ తరువాత జయంతులకు రావటమే మానుకున్నారు. భగవంతునికి అర్పించిన మనస్సుకు, మానావమానములు, నిందాస్తుతులు, తృణప్రాయంగానే ఉంటాయి. అట్టి భక్తుడు భగవంతుని వద్దకు రాకుండా ఏ శక్తీ అడ్డుకోలేదు. మీరు నావద్దకు రాకపోయినా, మాతృతుల్యులుగా మీకు నా హృదయంలో శాశ్వత స్థానం ఎప్పుడూఉంది" అన్నారు. సత్యవతమ్మగారు వేణమ్మగారితో తమ విషయం చెప్పుకొని, "నా కృష్ణయ్యకు నేను తలంటుపోసుకుని, తలదువ్వి, గోరుముద్దలు పెట్టి, లాలించి సేవ చేసుకునే భాగ్యం నాకిక లేదుకదా!" అని కళ్ళు వాచిపోయేటంతగా దుఃఖించారు.

సత్యవతమ్మగారు, సూర్యనారాయణగారు యిద్దరూ శ్రీబాబును "మా కృష్ణయ్య" అని అభిమానంతో గోముగా పిలుచుకునేవారని, యశోదా నందులు శ్రీకృష్ణుని సేవించుకున్నట్లు, ఆ దంపతులు శ్రీబాబును సేవించుకున్నారని, వారి సన్నిహితులు చాలామంది చెప్పారు. నిజమే! అలనాడు శ్రీకృష్ణుడు దేవకీ

వసుదేవుల కుమారుడై జన్మించినా, ఆయనను లాలించి, సేవించుకుని, ఆలనా, పాలనా, చూసుకొనే భాగ్యం మాత్రం యశోదా నందులకే దక్కింది. అలాగే శ్రీబాబుకు జన్మనిచ్చి ధన్యులైన మాతాపితరులెవరోగాని, శ్రీబాబు బాల్య జీవితంలో వారి సేవాభాగ్యము శ్రీసత్యవతమ్మ, సూర్యనారాయణగార్లకే దక్కిందని చెప్పవచ్చు.

దైవ ఘటనలు చాలా విచిత్రంగా ఉంటాయి. శ్రీకృష్ణుడు బృందావనం నుంచి మధురకు వెళ్ళిన తరువాత, తిరిగి బృందావనానికి రానేలేదు. యశోదా నందులకు మళ్ళీ ఆ జగన్నాధుని సేవా భాగ్యం లభించనే లేదు. ఇప్పుడు సత్యవతీ సూర్యనారాయణ దంపతుల జీవితంలో కూడా అలాగే జరిగింది. తమ అవతార బహుళ ప్రయోజనార్థమై, శ్రీబాబు ఉప్పాడ విడిచి వెళ్ళిన తరువాత, తిరిగి ఉప్పాడకు రానే లేదు. శ్రీబాబు దర్శనం ఆ తర్వాత సకృత్తుగా లభించినా, ఆ దంపతులకు శ్రీబాబు సేవా భాగ్యం మళ్ళీ లభించనే లేదు. అది ప్రభు లీలా విలాసము. హరిహరాదులకు కూడా తెలియ తరము గానిది.

## కోరుకొల్లు

శ్రీబాబు, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణానికి సుమారు 25కి.మి దూరంలో ఉన్న కోరుకొల్లు గ్రామానికి మొదటి సారిగా వచ్చినప్పుడు వారిని దర్శించిన వారిలో శ్రీ దాట్ల కృష్ణంరాజుగారొకరు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఒకరోజు ఉదయం ఎర్రని పట్టుబట్టలతోను, దేవతార్చన పెట్టెతోను, సన్నగా, చామనచాయగా, తేజోవంతములైన నేత్రములతోను, చెవులకు పోగులతోను, ముక్కుకు కాడతోను, ఒక మండువా యింటి లోగిలిలో అరుగుపైన కూర్చుని ఉన్న ఒక బాలుని చూచి, కృష్ణంరాజుగారు "ఎవరు నువ్వు?" అని అడిగారు. "నేను నేనే లెండి" అని అంటూ ఆ బాలుడు, కృష్ణంరాజుగారి విలాసజీవితానికి సంబంధించిన ఒక విషయాన్ని (అది కృష్ణంరాజుగారికి తప్ప మరెవరికీ తెలియదు) ప్రస్తావించాడు. గతుక్కుమన్న కృష్ణంరాజుగారు "ఓహో! కేరళ మళయాళ మాంత్రిక విద్యలేవో నేర్చుకొని వచ్చినట్లున్నావే!" అన్నారు. ఆ బాలుడు "జగన్మాత అనుక్షణ చింతనము ఒక్కటే నాకు తెలిసిన విద్య. అంతకంటె యితర విద్యలేవీ నాకు తెలియవు" అన్నాడు. ఆ బాలుడే శ్రీబాబు.

అంతలో అటునుంచీ ఇటునుంచీ జనం పోగవటం, తలో కొన్ని ప్రశ్నలు అడగటం, శ్రీబాబు వారికి భూత, భవిష్యద్వర్తమానములతో సహా జవాబులు చెప్పటం జరిగిపోయింది. అప్పటికే మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటింది. ఈ "బాల సాధువు"గారికి ఎవరైనా బ్రాహ్మణుల యింటిలో భోజనం ఏర్పాటు చేస్తే బాగుంటుందని, కృష్ణంరాజుగారు శ్రీ విఠాల సత్య కామయ్యశాస్త్రిగారి యింటికి కబురు చేశారు. తరువాత మరి కొంత సేపటికి కామయ్య శాస్త్రిగారు వచ్చారు.

కోరుకొల్లులో శ్రీ విఠాల సత్య కామయ్య శాస్త్రిగారు శ్రోత్రియ బ్రాహ్మణ కుటుంబంలోని వారు. వేద శాస్త్రాది విద్యలు క్షుణ్ణంగా నేర్చిన వారు. వారికి చిన్నతనంలోనే తీవ్రమైన వైరాగ్యం కలిగి యిల్లు వదిలి, తపస్సు చేసుకోవాలనే కోరికతో హిమాలయాలకు వెళ్ళారు. అక్కడ వారికి, బాగా నెరసిపోయి జడలు కట్టిన జుట్టుతో, గడ్డము, మీసము కూడా నెరసిన ఒక మహా తేజస్కుడైన వృద్ధ తాపసి కనిపించాడు. ఆయన తనంతట తానే శాస్త్రిగారి విషయమంతా చెప్పి, " నీ వైరాగ్యము మెచ్చుకోదగినదేగాని, నీకుయిక్కడ యిలా బ్రహ్మచారివై తపస్సు చేసుకునే యోగంలేదు. నీవు తిరిగివెళ్ళి, వివాహంచేసుకొని గృహస్థుడవై, జప తపో ధ్యానాదులు శ్రద్ధగా చేసుకో. తరించ గలవు"అని చెప్పారు. దానిని దైవాజ్ఞ గానే భావించి కామయ్య శాస్త్రి గారు యింటికి తిరిగి వచ్చి, గృహస్థులై సంతానమును పొంది, అనుష్ఠానపరులై తపో ధ్యానాదులు నెరపుకొనేవారు.

సుమారు 40 సం॥ముల తరువాత, శాస్త్రిగారు ఒకరోజు ఉదయం చెరువులో స్నానం చేసి బయటకు వస్తుండగా, తేజస్వి అయిన పదేండ్ల బాలుడు ఆయనకు కనిపించి మందహాసంతో "శాస్త్రిగారూ? తమ తపశ్చర్య నిర్విఘ్నంగా కొనసాగుతున్నదా?" అని ప్రశ్నించాడు. తెల్లబోయి చూస్తున్న శాస్త్రి గారికి, ఆనాడు హిమాలయాలలో కనిపించి, తన జీవన పంథానే మార్చి వేసిన వృద్ధ తాపసియే యీ బాలుడు అనే దివ్య స్ఫురణ కలిగింది. ముకుళిత హస్తాలతో, "మహాత్మా! తమ అమోఘాశీర్వచన బలము వలన నా తపో ధ్యానాదులు, మహదానందకరంగా జరిగిపోతున్నాయి. తమరు వచ్చి, తమ దివ్య పాద స్పర్శతో నా గృహమును పావనం చెయ్యండి" అని ప్రార్థించారు. "అలాగే" అన్నాడు ఆ బాలుడు. శాస్త్రి గారు రెండడుగులు వేసి తిరిగి చూసే సరికి ఆ బాలుడు అదృశ్యమైనాడు. ఆ రోజు మధ్యాహ్నమే, ఎవరో ఒక బాల సాధువు కోరుకొల్లు వచ్చారని, వారికి భోజన సదుపాయం ఏర్పాటు చేయ వలసినదని, శాస్త్రిగారికి కబురు వచ్చింది.

-సశేషం

# నీవు వినలేని పిలుపే లేదు

(గతసంచిక తరువాయి) -రమణప్రసాద్

ఈలోగా ఆలస్యం అవుతున్నది అని భక్తులు అనవసరంగా ఆందోళన పడటమేగాని, కాల స్వరూపులైన గురుదేవులకు ఎప్పుడు రక్షించుకోవాలో తెలియదా? కాలాన్ని శాసించే గురుదేవుల నిర్ణయకాలాన్ని అధిగమించే శక్తి కాలానికి ఎన్నడూ లేదు. కాలం తాళంచేతులు గురుదేవుల చేతిలో ఉంటాయి.

ఇంతలో చంపక భర్త శ్రీభాస్కరరావు మాతాజీ వద్దకు వచ్చారు. వారు శ్రీమాతాజీతో "అమ్మా! ఇప్పుడు మాకెవ్వరికీ చంపక పోయినందుకు దుఃఖం లేదు. మీరు వచ్చినందుకు మాకు కలిగిన ఆనందం మాటలలో చెప్పలేను. మీరు సకాలంలో వచ్చి ఆమెను ఉద్ధరించారు. మాకు ఇది చాలు" అన్నారు.

తరువాత శ్రీమాతాజీ వారికి చెప్పవలసినవి చెప్పి అక్కడనుండి వచ్చేశారు. ది. 12-5-10న శ్రీభాస్కరరావుగారు, వారి పుత్రుడు, కూతుళ్ళు, అల్లుళ్ళు ఇతర బంధువర్గం వారంతా శ్రీకాళీ వనాశ్రమానికి వచ్చి శ్రీ సద్గురుదేవులకు పాదపూజ చేసుకున్నారు. ఆ సందర్భంగా శ్రీమాతాజీ మాట్లాడుతూ "ఇవాళ్టి కార్యక్రమానికి కారకులు శ్రీ గురుసాయుజ్యాన్ని పొందిన చంపక. ఆమె అసలు పేరు సుభద్ర. సుభద్ర అంటే సుభద్రమే. శ్రీబాబు మొదటిసారిగా ఈమెను చూసి నీ పెళ్ళి శ్రీకృష్ణుడే చేస్తాడు అన్నారట. మరి శ్రీబాబు కృష్ణుడేగా! వారి ఆశీస్సులతోనే వీరి వివాహం జరిగింది. ఈమె కేవలం బాబును తప్ప వేరే దైవాన్ని నమ్మలేదు.

చంపక గురుదేవుల సేవ చేసుకొంది. మరి గురుదేవులు వదిలి పెడతారా? అమ్మ అస్వస్థతతో ఉంది. ఆవేదన పడుతోంది. ఆమెకు ఉపశమనం కలిగించాలి. ఆమె స్వామి అనుగ్రహానికి పాత్రురాలు కావాలి. నేను తీర్థం కొన్ని చుక్కలు అమె నోట్లో పోస్తే ఆ అమ్మ నాలుక బయటకు పెట్టి లోపలికి తీసుకుంది. మేమంతా "ఓం బాబు! శ్రీబాబు! మన హృదయబాబు" అని సంకీర్తన చేశాం. ఒకసారి తృప్తిగా చూసుకుంది. నేను తీసుకువెళ్ళిన చీర పసుపు, కుంకుమలు ఆమెకు ఇచ్చాను. ఒక్కసారి దీర్ఘశ్వాస తీసుకుంది. ఆమె గురు సాయుజ్యం పొందింది.

ఇలా ఎందుకు చేసుకున్నారు? అంటే అది బాబు లీల. ఆమె ఆయనకు చెందినది. మహాత్ములకు చేసుకున్న సేవ ఎక్కడికీ పోదు. అక్కడ చక్కగా బాబు నామం చేశాం. అందరం పాడాం. ఆమె వెళ్ళిపోయింది. ఇది బాధాకరమైన

సన్నివేశం అయినా అందరికీ ఒక అలౌకిక ఆనందాన్ని కలుగజేసింది. అక్కడ దుఃఖం లేదు. అమ్మ పోయిందా? అన్నారు అందరూ ఆశ్చర్యంతో! అంటే ఎటువంటి సన్నివేశాన్ని గురుదేవులు ప్రసాదించారు? అమ్మకు అటువంటి శాంతిని గురుసాయుజ్యాన్ని ప్రసాదించారు శ్రీ గురుదేవులు. ఆమె భర్తకు, పిల్లలకు పరమమైన శాంతిని, ఆత్మశాంతిని శ్రీగురుదేవులు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను" అన్నారు.

ఎవరైనా శ్రీమాతాజీ ముందు ఈ ప్రసంగం తెస్తే వారు నాదేమున్నది "అంతా బాబు లీల" అంటారు ఎంతో వినయంగా. శ్రీ సద్గురుదేవుల ముఖస్థగా ప్రవహించిన ఒక గీతం బ్రహ్మజ్ఞాని వినయపూర్ణుడు అంటుంది.

శ్రీ భాస్కరరావుగారు తాము రచయితకి వ్రాసిన లేఖలో "దయామయి పూజ్య అమ్మ స్వయంగా భీమవరం వచ్చి, చంపకని చూచి నాకు, నా కుటుంబ సభ్యులకు అంతవరకు గల ఆందోళన, మా మనస్సులలోని బాధలకు విముక్తి కలిగించి మాకందరికి ఊరట కలిగించిన సంఘటన మా జీవితములో ఊహించలేని, మరియు మరువలేని సంఘటనగా మేము భావిస్తున్నాము. భూమి మీదకు వచ్చిన ప్రతిజీవి ఎప్పటికైనా ఈశరీరాన్ని వదలి వెళ్ళటం సహజమే. అయినా ఆ విషయాన్ని తలచుకొని బాధ పడటం కూడ సహజమే. కాని పూజ్య శ్రీ అమ్మ రాక వాటన్నిటినీ మరపింప చేసింది. అప్పటి వరకు నా భార్య చంపక పడిన శరీర బాధలు అన్నీ పటాపంచలై అమ్మ రాక కొరకే వేచి యున్నట్లుగా అమ్మ చల్లని పవిత్ర సన్నిధిలో అమ్మ అమృత హస్తములతో పవిత్ర తీర్థమును స్వీకరించి వారి చేతిలో దేహం చాలించుట అత్యద్భుతమైన విషయంగా భావిస్తూ, పదేపదే నెమరు వేసుకొంటూ ఆనందాన్ని పొందుతున్నాము. అమ్మ రాక, ఆమె (నా భర్య) ఇక లేదు అన్న బాధను కూడ మరిపింప చేస్తున్నది. ఏ జీవికైనా ఇటువంటి స్థితి కలగటం దుర్లభము. తనకు ఇక పునర్జన్మ లేని స్థితి లభించినట్లుగా మేము భావిస్తున్నాము. పై సంఘటలన్నీ మా జీవితములో మరపురాని సంతోషకర విషయములుగా భావించుచున్నాము"అని చెప్పుకున్నారు. *

# ప్రయాణకాలే Z పి చ మాం తే విదుర్యుక్త చేతసః

(గతసంచిక తరువాయి) - సూర్య నారాయణ గుప్త

I.C.Uకు వెళ్ళి I.C.Uలో ఉన్నవారిని పలకరించి అమ్మ చెప్పిన విషయాలు మరోసారి చెప్తున్నాను. ఇంతలో ఫోన్ రింగ్ అయింది. అమ్మ దగ్గరనుండి. అమ్మకు నమస్కారం చెప్పగానే, అమ్మ ఫోన్ మా మామగారికి ఇవ్వమన్నారు. వెంటనే ఫోన్ మా మామయ్యగారికి అందించాను. ఆయన నీరసంగా సెల్ అందుకొని చెవి దగ్గర పెట్టుకున్నారు. అంతే అంతవరకు ఉన్న నీరసం ఎటుపోయిందో, వారు అమ్మకు స్పష్టంగా నమస్కారాలు చెప్పుకున్నారు.

శ్రీమాతాజీ వారికి ఫోన్‌లోనే తమ దివ్య బోధామృతాన్ని ప్రసాదించారు. బుద్బుద ప్రాయమైన మానవుడి జీవితాన్ని గురించి, ఆఖరి క్షణంలో అయినా సరే ఒక్క క్షణకాలంపాటు భగవంతునిపైన, లేదా గురులక్ష్యార్థము మీద మనస్సు నిశ్చయంగా నిలిపిన వారు ఎలా ఖట్వాంగ మహారాజులాగా మోక్షాన్ని పొందవచ్చో జీవితానికి చావు పరమార్థం కాదని, బ్రతికి ఉండగానే మరణించి, అంటే దేహధ్యాసను వదలి, ఎలా అమృతత్వాన్ని పొందవచ్చో వివరిస్తూ సాగిన ఆ బోధ ఏడు నిమిషాలపాటు సాగింది. అలా బోధను ముగించి అమ్మ వారికి ఫోన్‌లోనే లక్ష్యార్థాన్ని ప్రసాదించి, దానిని వారిచేత ముమ్మారు స్పష్టంగా పలికించారు.

మా మామగారి పూర్వజన్మ సుకృతము, అంతవరకు వారు ఇతరులకు తెలియనీయకుండా, తమకూ, తమ గురుదేవులకు మాత్రమే తెలిసేలా, రహస్యంగా అంతరంగంలో దాచుకున్న భక్తి అన్నీ ఆ క్షణంలో ఫలించాయనుకుంటాను. ఆయన తన సర్వస్వాన్ని అమ్మ పాదాలచెంత సమర్పించి, నిరహంకారంగా తమను సర్వ సమర్పణ చేసికొని సంపూర్ణ శరణాగతి పొందారు. గురుదేవులు మననుండి ఆశించేది ఆ సర్వ సమర్పణే. ఒక్కసారి మనం అలా శరణాగతి చెందితే చాలు, గురుదేవులు అజ్ఞానమనే తిమిరంతో అంధమైన వారి నేత్రాలకు జ్ఞానాంజనమనే శలాకతో శస్త్ర చికిత్స చేసి జ్ఞాన దృష్టిని ప్రసాదిస్తారు. గురుగీత అదే కదా చెప్తున్నది

**అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా**
**చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురువే నమః** ॥ అంటూ.

ఆ క్షణంలోనే వారి నేత్రములలో, హృదయంలో అంతా శ్రీమాతాజీవారి దివ్యాకృతి నిండిపోయింది. అంతకు ముందెన్నడూ మేము వారిలో చూచి ఉండని ఒక దివ్య తేజస్సుతో వారి మొగము వెలిగిపోవటం అక్కడ ఉన్న మేమందరమూ గమనించాము.

వారు నన్ను, నా బావమరిది రాజును వారి కుమారుణ్ణి పిలిచి, "అమ్మ వస్తే అలా నిలబెడతారేమిటి? వెంటనే కుర్చీ తెచ్చి వెయ్యండి" అని తొందర పెట్టారు. నాకు వెంటనే అర్థమైంది. గురుదేవులకు అసాధ్యమనేది లేదు. భారత సంగ్రామం జరగబోయే ముందు శ్రీ కృష్ణభగవానుడు అర్జునుడికి తన విశ్వరూప సందర్శన భాగ్యాన్ని కలిగించాడు. అర్జునుడికి దివ్య చక్షువులను ప్రసాదించాడు కనుక అర్జునుడొక్కడే ఆ విశ్వరూపాన్ని చూడ గలిగాడు, కాని ఇరువైపుల మోహరించిన సైన్యంలో మిగిలిన వారికెవ్వరికీ, ఆ విశ్వరూపం కనపడలేదు. వారికి అక్కడ ఎప్పుడూ కనిపించే శ్రీకృష్ణుని రూపమే కనిపించింది. శ్రీమాతాజీ అలాగే తమ సుదుర్దర్శ రూప సందర్శన భాగ్యాన్ని మా మామగారికి ప్రసాదించారు. ఆ రూపాన్నే కళ్ళలో నింపుకున్న వారికి అక్కడ మాతాజీ కనిపిస్తున్నారు గాని, మేము సర్వ వ్యాపకమైన అమ్మను అక్కడ చూడలేకపోయాము. విషయాన్ని గ్రహించగానే నేను నా శ్రీమతిని పిలిచాను. మా మామగారు కూతురుతో "అమ్మాయ్! అమ్మ వచ్చారు. అమ్మకు కుంకుమ పెట్టు, నీ దగ్గర లేకపోతే పక్కవారిని అడిగి తెచ్చుకో. అక్కడ నా పర్స్‌లో వెయ్యి రూపాయలు ఉన్నాయి. నీ తమ్ముడి దగ్గర ఒక వంద రూపాయలు తీసుకొని అమ్మకు పసుపు కుంకుమల క్రింద సమర్పించు" అని అప్పచెప్ప వలసినవి గబగబా చెప్పేసి, వెంటనే కన్నులు మూసుకొని దృష్టిని అంతర్ముఖం చేసి గురుప్రసాద లక్ష్యార్థంపైన మనస్సును కేంద్రీకృతం చేశారు. అలా అంతర్ముఖులైన వారు, ఆపైన ఎవ్వరితో మాట్లాడలేదు.

మర్నాడు అంటే 10వతేది ఉదయం 6గం॥30నిలకు మెల్లగా కళ్ళు విప్పి చూచారు. ఇంతవరకు తాను లోపల ఏ దివ్య మూర్తిని సందర్శిస్తూ ఆనందిచారో, ఆ దివ్యమూర్తి ఇప్పుడు బాహ్యంగా, అంతటా దర్శనం ఇస్తున్నది. అలా అంతటా అందరిగా దర్శనం ఇస్తున్న గురుమూర్తి దృష్టిలో దృష్టి నిలిపి, వారు దేహాన్ని విడిచి పెట్టారు. ఆత్మ పరమాత్మలో ఐక్యం అయింది.

-సశేషం

# అమెరికాలో శ్రీ మాతాజీ

**(ది. 10.06.2010 న్యూజెర్సీ, అమెరికాలో శ్రీ మాతాజీ వారి అనుగ్రహభాషణ సంగ్రహరూపం) -శివప్రసాద్**

(గతసంచిక తరువాయి)

శ్రీగురుదేవులు అందిస్తూ ఉండేవారు, కృష్ణుడు వచ్చి 'అత్తా! అత్తా! నీకేమి కావాలో కోరుకో అత్తా!' అని కుంతీదేవిని అడిగితే. ఆమె నాకెప్పుడూ ఇలాంటి కష్టాలే ఉండేటట్లు చెయ్యి కృష్ణా! అందట. అంతేకాదు, 'ఇన్ని కష్టాలు ఉండబట్టే కదా కృష్ణయ్యా! నిన్ను తలుస్తున్నాము. నేను సుఖంగా ఉంటే నీవు గుర్తు వస్తావో రావో, అందుకని, కష్టాలే కావాలి' అన్నది.

మహాత్ముల జీవితాలలో కష్టాలు లేవా? రామదాసుగారు పడలా? కబీర్‌దాస్ పడలా? మీరా పడలా? వాళ్ళ ఉపాధులు ఎలా ఉన్నా, వాళ్ళ అంతఃకరణం మాత్రం భగవంతుణ్ణి పెనవేసుకొని ఉన్నది. ఎందుకని? భగవంతుడు అంతగొప్పవాడు. అలా అని స్వధర్మాన్ని విడిచిపెట్టమని చెప్పలా. అది సోమరితనం అవుతుంది. శ్రీగురుదేవులు ఎప్పుడూ చెప్తుండేవారు, 'స్వధర్మాన్ని నెరవేర్చాలి. బాగా కష్టపడాలి, కాని కష్టాన్ని ఇష్టంగా మార్చుకోవాలి. ప్రపంచం సుఖదుఃఖాలను రెండిటినీ కలిగి ఉంటుంది అని గుర్తించి, నిజ జీవితంలో దానికి ఎలా నడుచుకోవాలో అలా నడచుకుంటూ, ఏది ఎంతవరకు చేసుకోవాలో అంతవరకు చేసుకోవాలి. బ్రహ్మజెముడు ముళ్ళమీద నడవాలంటే చెప్పులు వేసుకొని నడచినట్లు, ప్రపంచంలో కలిగే బోలెడన్ని సుఖదుఃఖాలు, కష్టాలు అనే ముళ్ళపై నడవాలి అంటే, గురుదేవులు ప్రసాదించిన పదములు అనే పాదుకలు వేసుకొని నడిస్తే, ఎలా నడచినప్పటికీ మన గమ్యస్థానం చక్కగా, సుఖంగా చేరతాము.

అటువంటి సద్గురువులు చూపించిన మార్గంలో నడిస్తే, ఆ పదముల దగ్గరకు వెళ్తాము. మనకు కనిపించేవన్నీ మనకు బంధన తెచ్చేవే కాబట్టి, ఎందులో ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉండాలి. ఈ ప్రపంచం ఎప్పుడూ ఎవ్వరినీ గుర్తించదు. ప్రపంచంలో మానవ జన్మలో ఉన్న మనమే గుర్తించాలి. అటువంటి గుర్తింపు ఇచ్చేవారే మహాత్ములు. వారు చూపిన అడుగుజాడలను ఆశ్రయిస్తే మన గమ్యస్థానం తప్పక చేరుకోగలము. అయితే అందుకు మనస్సును పవిత్రం చేసుకోవాలి. అంతఃకరణ పవిత్రంగా ఉంటే, అప్పుడు మననుండి వచ్చేమాట, ధోరణి, శబ్దం అన్నీ పవిత్రం అవుతాయి. ఆకాశానికి గుణం శబ్దం. శబ్దం పవిత్రమైతే ఆకాశం పవిత్రం అవుతుంది. మన మొదటి

గురువాణిలో మొదటి ఆర్టికల్(article) చదివితే, శ్రవణం అంటే తెలుస్తుంది. మన అంతఃకరణ పవిత్రంగా ఉంటే మన మాట పవిత్రంగా ఉంటుంది. వినేశబ్దం పవిత్రంగా ఉంటుంది. వినే మాట పవిత్రంగా వినగలుగుతాము. ఈ అనంతవాయువులో ఉన్న ఆకాశం పవిత్రత చెందుతుంది. ఆకాశం పవిత్రమైతే, వాయువు, అగ్ని, జలము, పృథ్వి అంటే పంచమహాభూతములు పవిత్రత చెందుతాయి.

ఈ శరీరానికి చాల పోషణ చేస్తున్నాము. కాని మనస్సుకు పోషణ ఏది? భగవన్నామం అనే రసాయనాన్ని దానికి అందించాలి. మనస్సుకు పోషణ భగవన్నామం. గురుదేవులు ఏమి చెప్పారో దానిని మాటిమాటికి మననం చేస్తూ ఉంటే, అంతఃకరణ పవిత్రం ఔతుంది. సినిమా చూస్తే మనస్సుకు brushing అయిపోదు. టైమ్ లేదు అని కారులో ఆఫీసుకు వెళ్ళేటప్పుడో, తిరిగి ఇంటికి వెళ్ళేటప్పుడో CDలు విన్నా అక్కడ ఏకాగ్రత ఉండటంలా. అనేకాగ్రతకు వెళ్ళిపోతున్నది. అలా కాకుండా మన జీవితంలో కొంత సమయాన్ని అయినా భగవంతుడి కోసం సద్వినియోగం చేసుకుంటే, అది మన నిత్యకాలంలో జమ అవుతుంది. మనకు లౌకికమైన అన్ని పనులకూ బోలెడంత టైమ్ ఉంటుంది. కాని కాసేపైనా భగవంతుణ్ణి ధ్యానం చేస్తున్నారా? time ఎక్కడండీ?అస్సలు ఎక్కడా కుదరటంలా వంటి సాకులు చెప్పవద్దు. ఇవన్నీ వంకలు. ఈ వంకలు ఎన్ని ఉన్నా ఇవన్నీ కూలి పోయేవే.

ఏ నిముషానికి, ఎక్కడ, ఎలా నడిపిస్తాడో, వాడి ఇష్టం. మనం సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు అయిన శ్రీగురుదేవుల పరమమైన అనుగ్రహాన్ని గుర్తించి, మన అంతఃకరణను ఎప్పుడూ పవిత్రంగా ఉంచుకోవాలి. గోడలు కట్టుకొని కూర్చుంటే, ఆ గోడలమధ్యే ఉండి పోతాము. మా ఇంట్లో నలుగురూ బాగుంటే చాలు అనుకుంటారు కొంతమంది. అంటే ఏమిటి? గోడలు కట్టుకొని కూర్చోటం అన్నమాట. మళ్ళీ వాళ్ళింట్లో ఏదైనా అయితే పదిమందీ వచ్చి సాయం చేయవలసిందే. మానవుడు కుంచుకుపోయే మనస్సు కలిగి ఉండటం చేత ఇటువంటి దౌర్భాగ్యం కలుగుతున్నది. అందుకని మనస్సును పవిత్రంగా ఉంచుకుంటే, విశ్వమంతా ప్రకాశిస్తున్న ఆ విశ్వనాధుని భగవచ్ఛక్తిని మనం ధారణ చెయ్యవచ్చు. అనుభవించవచ్చు. అయితే దానికి తగిన కృషి సాధన అవసరం. అంతఃకరణ పవిత్రంగా ఉంచుకొని ఆలోచిస్తే World మనది. మనది కాకుండా ఎక్కడికి పోతుంది? నేనంటూ బాగుండి, పడుకొని ప్రొద్దున లేస్తేనే కదా ప్రపంచం ఉన్నది. కాకపోతే మన హద్దుల్లో మనం నడచుకుంటూ, మన జీవితాన్ని ముందుకు నడిపించాలి.

(ఇక్కడ శ్రీమాతాజీ మన్‌కవాట్ ఖోలో, మలిన విషయధోలో అనే గీతాన్ని సంకీర్తన చేశారు. శ్రీగురుశ్శరణంమమ, సద్గురు శ్శరణంమమ అని తాము మధురంగా నామం చేస్తూ అందరితో చేయించారు.)

ఈ కీర్తనలో చెప్పినట్లుగా మన్‌కవాట్ ఖోలో. తలుపులు తెరచుకున్నాము. మలిన విషయ ధోలో. జన్మజన్మాంతరాలనుండి వస్తున్న కుళ్ళు భావనను కడిగేసుకో. శరీరానికున్న మురికే మనను ఇంత చికాకు పరిస్తే ఇక మనస్సో! ఎంత కడగనా మురికి వదలకుండా మనను చికాకు పరిచేది మనస్సు. బాహ్యాడంబరాలు ఎన్ని ఉండి ఏం లాభం? లోపల మనస్సు వ్యాకులిస్తున్నప్పుడు. లోపల ఉన్న కుళ్ళంతా, భగవన్నామంతో, సుహృద్భావనతో విరగడైపోతుంది. కాని మనం మళ్ళీ ఆ కుళ్ళును పేర్చుకోకుండా ఉండాలిగా? లోపల కుళ్ళు లేకపోతే కొన్ని నెలల తరువాత మళ్ళీ మలం అంత కంపుతో బయటకు ఎలా వస్తుంది. అది కూడ ఒక మహాత్ములు చెప్పారు. ఆ కథ చెప్పి పూర్తి చేస్తాను.

ఒక సాధుమహాత్ముడు శిష్యులను అన్నిటి కన్న హేయమైనది ఏది? అని అడిగాడు. ఒక శిష్యుడు ఆలోచించి చించి, ప్రతిరోజు మనం విసర్జిస్తాము కదా మలం, అదే అన్నిటిలోకి హేయమైనది అని చెప్పాడు. వెంటనే ఆ మలం "ఏమయ్యా! నేనసలు ఇలా కావటానికి కారణం ఎవరు? నిన్న రాత్రి నీవు లొట్టలేసుకుంటూ తిన్న బ్రహ్మాండమైన చక్కెర పొంగలిని నేనే. నీ పాలబడ్డాను. తిరిగి ఈ రూపం ధరించాను. దీనికి కారణం నీవు" అన్నదట. దీనికి కారణం ఏమిటి? హేయమైన, కఠినమైన, ప్రపంచపరమైనవి వినటం. అవి విన్నవాడు వాటిని హరాయించుకోలేక, ఇంటికి వెళ్ళి, ముందువాళ్ళతో, పక్కవాళ్ళతో దాన్ని గురించి బోలెడంత ఆలోచిస్తాడు. అది ఒక్కరోజుతో పోదు. దాన్ని మళ్ళీ మళ్ళీ కెలుకుతాడు. ఇవన్నీ వాసనలను పెంచేవి. వాటిని క్షాళన చేసుకోవాలి. మన్ కవాట్ ఖోలో, మలిన విషయ ధోలో. అప్పుడు రామనామం. రామ్‌కో బులాలో, ప్రేమ్‌సే బసాలో. ప్రేమతో ఆ రాముణ్ణి పిలుచుకో. నీ హృదయాన్ని ఆ రాముడికి నివాసంగా చెయ్యి. ఇక్కడ ఇంకొకటి కూడ ఉన్నది, జ్ఞాన పరంగా. రామ్‌కో పహచాలో, ప్రేమ్‌సే అపనాలో. అక్కడే ఉన్నాడు రాముడు చైతన్య రూపంలో దానిని గుర్తించు ముందర. గుర్తించిన తరువాత, ప్రేమ్‌సే అపనాలో. అప్పుడు నీదే. భగవంతుడు ఎవరివాడు? నావాడే. నాకు కాకపోతే కదా! నావాడు కనుకనే ఇందరిలో ఉన్నవాడు నాకు కనిపిస్తున్నాడు. అణువు అణువులో ఆయన పాదరేణువులు. ఆయన పదములు చక్కగా విరాజిల్లుతున్నై. వాటిని మనం గుర్తించాలి.

నువ్వు ఏ నామం చేసుకుంటావో నీ ఇష్టం. పాండురంగ బోలో, పంఢరినాథ్ బోలో, కమలనయన బోలో, కలుషహరణ బోలో. సంకీర్తన్ కర్‌లో. చప్పట్ల కోసం పాడే పాటలు కావు. భక్తితో, భగవంతుడి సాక్షాత్కారాన్ని పొందాలన్న ఆవేదనతో కూడిన కీర్తనలుంటే ఎంత బాగుంటుంది? మామూలు సేవకాదు. సంసేవన్, సమ్యక్ సేవ. ప్రభూ! నేను ఏదేది ఆచరిస్తున్నానో, అదంతా నీ సేవ. అంటే ఏదో పనికిరాని సేవలుకాదు. అటువంటి మధురమైన భావన మనస్సు పొంది చేసిన సేవనే, సంసేవ అంటారు. చరణ ధ్యాన్ కర్‌లో. అప్పుడు జన్మ ధన్య కర్‌లో దాని పక్కనే ఉంటుంది. చరణధ్యానం ఎక్కడ ఉన్నదో, జన్మ అప్పుడే ధన్యం అయింది. గుజర్‌రహాహై కాల్. మీరు వచ్చి అప్పుడే గంట దాటింది. ఆయువు వృథాగా కాలగర్భంలో కలసిపోతున్నది. ఈ కనిపించేవేవీ వెంటరావు. తత్త్వం అనేది ఒక్కటే నీ వెంట పడి వచ్చేది. లేదూ, నీవు సుకృత, దుష్కృత కర్మలు ఆచరిస్తే, సుకృత కర్మలకు మంచి జన్మ, దుష్కృతాలకు హీన జన్మ వస్తుంది. మానవ జన్మ చరితార్థం చెందాలి అంటే, భగవంతుడు చూపిన త్రోవలో, మంచిని ఆలోచించి, మంచిని చేసి, మంచినే విని, ప్రతిదానిలో రాముణ్ణి చూడాలి.

గుజర్‌రహా హై కాల్. పీఛేపడా హై కాల్. మన జీవితం గడచి పోతున్నది. వెనకనే యముడు కాలరూపంలో పొంచి నిల్చున్నాడు. ఇటువంటి భావమే ఒక కబీర్ గీతంలో ఉన్నది. మట్టి అంటుందట, 'ఎందుకు నీవు నన్ను తొక్కుతావు. ఏదో ఒకనాడు నీవు కూడ ఈ మట్టిలో కలసి పోయేవాడవే. ఆరోజు తప్పక వస్తుంది' అని ఖోతారహాహై జ్ఞాన్, పడ్‌నా శరణ్ భగవాన్. ఉన్న జ్ఞానం కూడ పోతున్నది. గుర్తించటంలా. సమయాన్ని సద్వినియోగ పరచుకోవటంలా. హాయిగా భగవంతుణ్ణి ఆశ్రయించు. అంతటా ప్రకాశించే ఆ భగవంతుణ్ణి నీవు ఏ రూపంలో ఆరాధించినా పవిత్ర అంతఃకరణంతో మాత్రం ఆరాధించు. అలా ఆరాధిస్తే నీ హృదయంలో ఉన్న గురుస్వరూపాన్ని గుర్తిస్తావు. మనం ఆశ్రయించిన పాదం మీద అటువంటి అచంచలమైన, అఖండమైన భక్తి విశ్వాసాలను పెంపొందించుకుంటూ చక్కగా మన జీవితాన్ని ముందుకు నడపాలి.

అటువంటి భక్తిజ్ఞానవైరాగ్యములను, ఆయురారోగ్య ఐశ్వర్యాలను, పుత్రపౌత్రాదులను శ్రీగురుపాదుకలు అందరికీ ప్రసాదించి సర్వదా రక్షించుగాక! సుఖీభవ! సుఖీభవ!




(గతసంచిక తరువాయి) -రమణ ప్రసాద్

"ఆ విషయం అంతటితో వదిలెయ్యి వత్సా!" అన్నాడు అక్రూరుడు, శతదన్వుడిలో అప్పుడే రగులుతున్న అగ్నిలో ఆజ్యం పోస్తూ. సత్యభామను నీవు పొందాల్సిఉంది కాని...."

"కాని, ఏమిటి అక్రూరా?"

దేని కారణంగా సత్రాజిత్తు అహంకారం ఆకాశాన్ని అంటిందో, ఆ మణి అతని దగ్గర లేకుండా పోతే.... ఆ మణి అతనికి దక్కకుండా పోతే.... అతనికి తెలిసివస్తుంది.

"కాని.... కాని ఇది ఎలా సంభవం? శమంతకమణిని అతని వద్ద నుంచి తీసుకోవటం సంభవమయ్యేపని కాదు....." శతధన్వుని భృకుటి ముడుచుకుంది.

"సత్రాజిత్తుపైన నాకు కూడా చాలా కోపంగా ఉంది అక్రూరా!"

"అయితే ..... ఆ మణి నీదగ్గర ఎందుకు ఉండకూడదు శతధన్వా?"

శతధన్వుని చెవిలో రహస్యం చెబుతున్నట్లుగా "అరే సత్రాజిత్తు ముదుసలి. నువ్వు యౌవ్వనంలో ఉన్నావు. సత్రాజిత్తుకి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా... అతనిని అంతం చెయ్యి...."

శతధన్వుడు ఉలిక్కపడ్డాడు, "సత్రాజిత్తుని హత్య చేయటమా! ఏమిటి మీరు అనేది..." అని తనను తాను అదుపులోకి తెచ్చుకుంటూ ఇలా అన్నాడు. "ఇది చాలా తేలిక పని! కాని యాదవులందరూ కూడి..... స్వయంగా కృష్ణుడే ఆ హంతకుడిని వెదికితే...."

"నువ్వు అనవసరంగ భయభీతుడవు అవుతున్నావు శతధన్వా!" అని అక్రూరుడు ధైర్యం చెబుతూ అన్నాడు "అటువంటి సమస్యే కనక వస్తే నేను నీకు సహాయపడ్తాను. ఆ సత్రాజిత్తు మరణిస్తే.... ఆ తరువాత ఆ మణి స్వామిత్వం నీకు దొరికితే....."

శతధన్వుడికి అక్రూరుడు చెప్పిన మాటలు నచ్చాయి... ఇద్దరూ తమ

తమ మనస్సులలో రగులుతున్న వైరాగ్నిని ఏకత్రితం చేశారు. అక్రూరుని వంటి యాదవుని ఆశ్రయాన్ని పొందిన శతధన్వుని వైరాగ్ని పెల్లుబికింది.

అతను హత్య చేయటానికే నిశ్చయించుకొన్నాడు. సత్యభామ దొరకకపోతే ఏం? శమంతకమణిని దక్కించుకుంటాం....! సత్రాజిత్తుకు తగిన పాఠం నేర్పాల్సిందే.... ఇద్దరూ అనుకూల సమయం కోసం ఎదురు చూడసాగారు.... ఆ అనుకూల సమయం రానేవచ్చింది.

వారణావతంలో లాక్షాగృహంలో పంచపాండవులు, కుంతీమాత భస్మమైనారు అన్న వార్త అంతటా వ్యాపించటంతో కృష్ణ బలరాములతో సహా అందరూ విచలితులైనారు. ధృతరాష్ట్రుని, భీష్ముని ఊరడించటానికి కృష్ణబలరాములు వరిష్ఠ యాదవులతో హస్తినాపురానికి బయలుదేరారు. అప్పుడు ద్వారక రక్షణభారం అక్రూరునిపై పడింది. శతధన్వునికి సదవకాశం వచ్చింది. అతడు తలుచుకున్న అకృత్యం.... అదే సత్రాజిత్తుని హత్య చేశాడు. శమంతకమణి దొంగిలించాడు. ద్వారకలో కోలాహలం... గుసగుసలు చెలరేగాయి. అక్రూరుని సమక్షంలో జరిగిన ఈ ఘోరకృత్యం శతధన్వుడే చేసి ఉంటాడన్న వదంతి వచ్చింది.... ప్రజలు తమ శంకలను ప్రకటితం చేశారు....కాని అక్రూరుడు వీటన్నిటిని ఏమాత్రం లక్ష్యం చేయలేదు.... కాని కృష్ణుడు తిరిగి వస్తే ఈ విషయం ఎలా బయటపడకుండా ఉంటుంది?

కృష్ణుడు శతధన్వుని పిలిచాడు. సంకర్షణ బలరాముడు అమూల్యమైన మణి దొంగతనం గురించి విని క్రోధ పూరితుడైనాడు. ఎలాగైనా సరే ఆ మణిని తిరిగి ప్రాప్తం చేసికోవాలి అని నిశ్చయించుకున్నాడు. కృష్ణుడు శాంతంగా ఉన్నాడు. శతధన్వుని దోషిగా నిలబెట్టేముందు అతనినే అడిగి పూర్తి వివరాలను రాబట్టాలనుకున్నాడు.

కృష్ణుని పిలుపురాగానే శతధన్వుడు గడగడలాడాడు. అపరాధి అయిన అతని అంతరాత్మ ఘోషించింది. భయభీతుడైనాడు. యాదవ సభలో కృష్ణుని ముందు ఎలా నిలువగలడు?.... అసంభవం! యాదవుల అనుమానాస్పద దృష్టి... కృష్ణుడు సభతీర్చి ఉండగా...... శమంతకం మాట వదిలివేసి ప్రాణ రక్షణఎలా చేసికోవాలా అన్న ప్రశ్న అతనికి ఎదురైంది.... అతడు అక్రూరుని వద్దకు పరిగెత్తాడు."

"అక్రూర మహాశయా! శమంతకమణిని రక్షణ మాట అటు ఉంచండి నా ప్రాణాలు రక్షించుకోవటం ఎలా?... మీరే... కేవలం మీరే నాకు సహాయం చేయగలరు" అన్నాడు.

"శతధన్వా!..... అని మౌనం వహించాడు అక్రూరుడు. ఎందుకంటే గంభీరమైన పరిస్థితి. ఎదురుగా కృష్ణ బలరాములు, వారి ఎదుట నిలిచి మాట్లాడటం దుష్కరమైన కార్యం. ఈ విషయం అక్రూరుని కన్న బాగా ఇంకెవరికి తెలుస్తుంది! సత్రాజిత్తు హత్యతో తనలోని వైరాగ్ని చల్లారింది. ఇందులోంచి తను తప్పించుకొని బయటపడటమే శ్రేయస్కరం అని.... ఈ సమయంలోనే శమంతకాన్ని వశం చేసికోగలిగితే.... అది ఉత్తమంగా ఉంటుంది. ఆ! శమంతకానికి శతధన్వుడు యోగ్యుడైతేగా!...

పరాక్రమవంతుడైన అక్రూరునిలోని కుటిల అక్రూరుడు బయటకు వచ్చాడు. శమంతక మణి తన దగ్గర ఉంటుంది. అందరూ శతధన్వుని దోషిగా నిర్ధారిస్తారు. కృష్ణుని కోపజ్వాల అతనిని భస్మీభూతం చేస్తుంది.... ఎవ్వరికీ అనుమానం కూడా రాదు. ఈ ఆరోపణ అంతా ఇంకొకరి నెత్తిన పడుతుంది.

"శతధన్వా!" ఎంతో సావధానంగా పిలిచాడు. కృష్ణునికి ఏమాత్రం అనుమానం రాకుండా నువ్వు వెంటనే ద్వారక విడిచి పారిపో..."

"ఇప్పుడా... ఈ సమయంలోనా అక్రూరా! మరి ఈ శమంతకాన్ని ఏం చెయ్యను? మీరు ఈ మణిని మీ దగ్గర జాగ్రత్త పరిస్తే నేను ఎక్కడికైనా దూరంగా పారిపోతాను...."

అక్రూరునికి కావల్సిందీ అదే! తన మనసులోని మాటనే శతధన్వుడు చెప్పాడు... అతడు శమంతకాన్ని గుప్తధనం దాచినట్లుగా దాచివేశాడు.... శతధన్వుడు తిరిగి కనిపించలేదు... అతడు ద్వారక విడిచి ఎక్కడికో పారిపోయాడు.

శతధన్వుడు పారిపోయాడు..... అన్న సమాచారం విన్న బలరాముడు మండిపడ్డాడు. "కృష్ణా! పాపి అయిన శతధన్వుణ్ణి ప్రాణాలతో వదల కూడదు.... పద, మనం వాడిని వెంబడిద్దాం.... మనం శమంతకాన్ని తిరిగి దక్కించుకోవాలి!

యాదవగణం బలరాముని సమర్థించింది.

-సశేషం

---

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - Guda Siva Rama Murthy,